సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 13-6-2025 15/-

# విద్వేషమే రాజకీయమా?



సమకాలీన భావాల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 23 హైదరాబాద్
శుక్రవారం 13 జూన్ 2025 రూ.15-00
16 జిల్‌హజ్జ 1446 హిజ్రీ


### తొలిగీటు

**ఎవరయితే ఇతరుల జానెడు భూభాగాన్ని అన్యాయంగా దోచుకుంటారో అల్లాహ్, ప్రళయ దినాన ఏడు భూముల భారం అతని మెడలో వ్రేలాడవేస్తాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





8

**విమర్శకు ప్రతి విమర్శ బూతులేనా?**

## లోపల...


హజ్ యాత్రలో ఏఐ ...... 04
విద్వేషమే రాజకీయమా? ...... 05
స్ఫూర్తిదాయమైన బలిదానం ...... 10
మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) ...... 14
చరితార్థులు-2 : బేగం సుగ్రా ఖాతూన్ ...... 17
వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... 18
అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... 19
మహనీయ ఉసామా బిన్ జైద్ (రజి) ...... 20
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత ...... 24
మహనీయ ముహమ్మద్ (స) మహితోక్తులు ...... 26
నాన్న... ఓ నాన్న! ...... 30
సంక్షిప్త భారతం ...... 32
సర్వత్రా ...... 33
ఆచరణలను బట్టి పరలోకంలో... ...... 34


### అంతా నాటకం!



పంచుతోంది భాజపా
ఇంటింటికి సింధూరం
ఏదో పొడిచేసినదట
భలేగుంది విడ్డూరం?
సింధూర్ పవిత్రతను
పెట్టొద్దటోయి తాకట్టు
ఎన్నికల్లో లబ్ది కొరకు
చెయ్యొద్దట కనికట్టు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

ఆలోచన

# హజ్ యాత్రలో ఏఐ

**హజ్ యాత్రలో** భాగంగా మక్కా లోని కాబాగృహానికి లక్షలాది మంది యాత్రికులు తరలి వెళ్ళారు. ఏటా జరిగే ఈ హజ్ యాత్రలో ఎలాంటి అపశ్రుతులు జరగకుండా చేయడానికి సౌదీ ప్రభుత్వం పూర్తి ప్రయత్నాలు చేస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఏర్పాట్లు చేస్తున్నారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ కూడా ఉపయోగిస్తున్నారు.

హజ్ యాత్రకు వెళ్ళే వారిలో ప్రపంచంలోని అన్ని భాషలు మాట్లాడేవాళ్ళుంటారు. అన్ని సాంస్కృతిక నేపథ్యాల వాళ్ళుంటారు. వారందరి భద్రత, జనసందోహాన్ని నియంత్రించటం, ధార్మిక ఆచరణలకు అవసరమైన మార్గదర్శకత్వం– ఇవన్నీ దాదాపు 50 డిగ్రీల మండుటెండల్లో నిర్వహించడం చాలా కష్టమైన పని.

ఈ పనులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగిస్తున్నారిప్పుడు. కాబాగృహం వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పని చేసే మనారా రోబోట్‌ను ఏర్పాటు చేశారు. 11 భాషల్లో ఈ రోబోట్ హజ్ క్రియలకు సంబంధించిన మార్గదర్శకత్వం ఇస్తుంది. రోబోట్‌లో అసంఖ్యాక ఫత్వాల డాటాబేస్‌ను ఫీడ్ చేశారు. దీని ఆధారంగా రోబోట్ అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇస్తుంది. మరీ సంక్లిష్టమైన ప్రశ్నలైతే వెంటనే ధార్మిక పండితులతో వీడియో కాల్ ఏర్పాటు చేస్తుంది.

ఇంతకు ముందు సౌదీ అరేబియా సారా అనే రోబోట్‌ను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే.

మనారా రోబోట్ మాత్రమే కాదు, లక్షలాది యాత్రికుల సౌకర్యం కోసం ఇతర ఏర్పాట్లు కూడా ఉన్నాయి. గ్రౌండ్ సెన్సార్లు, గేట్ రీడర్లు మస్జిదు ప్రవేశద్వారాల వద్ద ఏర్పాటు చేశారు. వీటి వల్ల లక్షలాది మంది యాత్రికుల రాకపోకల నియంత్రణలో సౌలభ్యం లభించింది. ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థల వల్ల ఎక్కడ తొక్కిసలాట జరిగే అవకాశం ఉందో, ఎక్కడ గుంపు ఎక్కువవుతుందో తెలుసుకుని, పాదచారులను మరో మార్గంలోకి మళ్ళించవచ్చు. ఇది యాత్రికుల భద్రతకు, ఆధ్యాత్మిక వాతావరణానికి ఎంతో ఉపకరిస్తుంది.

అరఫాత్ మైదానం వద్ద 84 వేల చదరపు మీటర్ల రోడ్డును పునర్నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్ 40 శాతం సూర్యరశ్మిని ప్రతిబింబిస్తుంది. దానివల్ల ఉపరితల వేడి 12 డిగ్రీల వరకు తగ్గుతుందని అంచనా. అరఫాత్ లోని కారుణ్య కొండ (జబ్లె రహ్మ) వద్దకు చేరుకునే 4 వేల మీటర్ల పొడవైన పాదచారుల మార్గం షాక్ అబ్జార్బింగ్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది వయసు మళ్ళిన వారికి సదుపాయంగా ఉంటుంది.

12 వందల మీటర్ల పొడవైన గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేశారు. అబ్దుర్రహ్మాన్ ఫకీ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన ఈ కారిడార్‌లో చెట్లు, వాటర్ ఫౌంటేన్లు, మిస్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల యాత్రికులకు ఎంతో సౌలభ్యం లభిస్తుంది.

సౌదీ అరేబియా ప్రభుత్వం ఈ హజ్ యాత్రలో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధునికతను ఒకవైపు ఆహ్వానిస్తూనే మరోవైపు ధార్మిక, ఆధ్యాత్మిక అనుభవాలను కాపాడుతూ, యాత్రికులకు సౌలభ్యం, భద్రత, అవసరమైన సేవలు తక్షణం అందుబాటులో ఉండే సదుపాయాలను కల్పిస్తోంది. ముఖ్యంగా సౌదీ ఇప్పుడు కృత్రిమ మేధస్సు రంగంలో పురోగమించే ప్రయత్నాలు చేస్తోంది. ఆధ్యాత్మిక సందర్భాల్లో కూడా ఏఐ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది.

ధార్మిక వ్యవహారాల్లోను ఏఐను ఉపయోగించడం అనేది వినూత్న ప్రయోగం మాత్రమే కాదు సాహసోపేతమైన ప్రయోగం కూడా. విమర్శలు వచ్చే అవకాశాలున్నప్పటికీ సౌదీ దీనికి పూనుకుంది. దీనివల్ల రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ధార్మిక, ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో మరింత ఉపయోగించుకునే వాతావరణం ఏర్పడవచ్చు.

హజ్ యాత్ర అని మాత్రమే కాదు, లక్షలాది మంది యాత్రికులు వచ్చే సందర్భాల్లో ఎక్కడైనా జనసందోహాన్ని నియంత్రించడానికి, అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వల్ల ఎన్ని మంచి ఫలితాలుంటాయో సౌదీ ప్రభుత్వం ఒక ఉదాహరణను చూపించింది.

విజ్ఞానమైనా, సాంకేతిక ప్రగతి అయినా మనిషికి సదుపాయాలు కల్పించడానికి దేవుడు ప్రసాదించిందే. దేవుడు ప్రసాదించిన బుద్ధివివేకాలు, మేధో సంపదే మనిషిని ఈ విజయాలు సాధించేలా, ఈ ఆవిష్కరణలు చేసేలా మలిచింది. అందువల్ల ఈ సాంకేతిక ప్రగతి వికాసాలను నిత్యజీవితంలో సదుపాయాలకు మాత్రమే కాకుండా ధార్మిక, ఆధ్యాత్మిక సౌలభ్యాలకు కూడా ఉపయోగించుకోవడమే విజ్ఞత అనిపించుకుంటుంది.

✤ ✤ ✤

అబ్దుల్ వాహెద్

# విద్వేషమే రాజకీయమా?

**కోల్‌కతాలో** జరిగిన బీజేపీ కార్యకర్తల సభలో హెూంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై దాడి చేశారు. మమతా బెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను విమర్శించారని, పాకిస్తాన్‌లో వందలాది టెర్రరిస్టులను హత మార్చిన ఆపరేషన్ సింధూర్‌ను విమర్శించి ఆమె భారత మహిళలను అవమానించారని, ఇదంతా ఆమె ముస్లిం ఓటు బ్యాంకును బుజ్జగించడానికి చేస్తున్నారని అన్నారు. అంతేకాదు, పహల్గాం టెర్రర్ దాడిపై మమతా బెనర్జీ ఎందుకు మౌనంగా ఉన్నారని, బెంగాల్ టూరిస్టులు పహల్గాంలో చనిపోయినా ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. సరిహద్దుల్లో చొరబాటులను అడ్డుకునే ప్రయత్నం ఆమె ఎన్నడూ చేయదని, కేవలం బీజేపీ మాత్రమే చొరబాటు లను అడ్డుకోగలదని కూడా అన్నారు.

దీనికి జవాబు తృణమూల్ కాంగ్రెస్ నుంచి వచ్చింది. పహల్గాం టెర్రర్ దాడికి బాధ్యత వహిస్తూ హెూంమంత్రి రాజీనామా చేయాలని సాగరికా ఘోష్ ఆయనపై దాడి చేశారు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద వాషింగ్ మెషిన్ అని వ్యంగ్యంగా చెబుతూ సువేందు అధికారి అవినీతిని కూడా కడిగి ప్రక్షాళనం చేశారని ఎత్తిపొడిచారు. చొరబాటులను ఆపవలసిన బాధ్యత ఎవరిపై ఉంది? ఎవరికి అధికారం ఉంది? అర్థసైనిక బలగాలు, సరిహద్దు భద్రతాదళం ఎవరి కింద పనిచేస్తున్నాయి? చొరబాటు లను ఆపలేని మీ అసమర్థతను మీరే ఒప్పుకుంటున్నారని నిల దీశారు. పహల్గాం టెర్రరిస్టులు ఎలా చొరబడ్డారని ప్రశ్నించారు.

అమిత్ షా ప్రసంగంలో గమనించవలసిన వాక్యం– ముస్లిము లను బుజ్జగించడానికి మమతాబెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను విమర్శించారన్న వాక్యం. అంటే ఆపరేషన్ సింధూర్ ను విమ ర్శించడం, లేదా వ్యతిరేకించడాన్ని ముస్లిములకు ముడేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ముస్లిములు ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తున్నారనే భావం ఆయన మాటల్లో ఉంది. ఇది హిందూ ముస్లిం రాజకీయం కాదా? ఇది విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయం కాదా? ఒక హెూంమంత్రిగా ఆయన ఈ మాటలు ఎలా చెప్ప గలరు? దేశంలోని కోట్లాది ముస్లిముల దేశప్రేమపై ప్రశ్నార్థకం ఎలా వేయగలరు?

ఇప్పటి వరకు పహల్గాంలో టెర్రరిస్టులు ఎలా ప్రవేశించారో చెప్పలేని వారు, ఇప్పటి వరకు పహల్గాంలో దాడి జరిగిన బైసరన్ లోయలో పోలీసు బందోబస్తు ఎందుకు లేదో, ఎవరు బందో బస్తును తొలగించారో చెప్పని వాళ్ళు, ఇప్పటి వరకు ఆ టెర్రరిస్టులు ఎందుకు అరెస్టవ్వలేదో చెప్పలేని వాళ్ళు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పలేదు కాని, ఎన్నికల ప్రసంగాలు చేస్తూ విద్వేష మంటలు రాజేయడానికి ప్రయ త్నిస్తున్నారు.

ఇక్కడ అడగవలసిన ప్రశ్న ఏమిటంటే, ఆపరేషన్ సింధూర్ ను మమతా బెనర్జీ విమర్శించిందా? వ్యతిరేకించిందా? లేదా అన్నది తర్వాతి ప్రశ్న... అసలు ప్రశ్న ముస్లిం బుజ్జగింపు రాజకీయా లకు ఆపరేషన్ సింధూర్ వ్యతిరేకతకు సంబంధం ఏమిటి? దేశంలోని ముస్లిములు ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తున్నారని అమిత్ షా చెప్పదలచుకున్నారా?

అదే నిజమైతే – ఆపరేషన్ సింధూర్‌కు ప్రతినిధిగా మీడియా

సమావేశంలో మాట్లాడిన కల్నల్ సోఫియా ఖురైషీ ఎవరు?

అలాగే –

ప్రస్తుతం విదేశాలు పర్యటిస్తూ భారతదేశ విధానాన్ని వివిధ దేశాల్లో చాటి చెబుతున్న 57 మంది పార్లమెంటు సభ్యుల్లో ఎక్కువగా చర్చకు వచ్చిన పేరు అసదుద్దీన్ ఒవైసీ. దేశ్ కీ షాన్.. భాయిజాన్ అని మన జాతీయ మీడియా పిలిచిన అసదుద్దీన్ ఒవైసీ ఎవరు?

ఈ 57 మంది పార్లమెంటు సభ్యుల టీముల్లో ఉన్న మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, సీనియర్ నేత గులాం నబీ ఆజాద్, ఈ.టీ. ముహమ్మద్ బషీర్, సర్ఫరాజ్ అహ్మద్, మియా అల్తాఫ్ అహ్మద్, అంబాసిడర్ సయ్యద్ అక్బరుద్దీన్ … వీళ్ళంతా ఎవరు?

మే 8వ తేదీ టైమ్స్ ఆఫ్ ఇండియా వార్త ప్రకారం భారతదేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముస్లిములందరు పాకిస్తాన్ పై సైనిక చర్యను నిర్ద్వంద్వంగా ప్రశంసించారని వార్త వచ్చింది. జమీఅతె ఉలమాయే హింద్ ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా మాట్లాడింది. జమాఅతె ఇస్లామీ హింద్ టెర్రరిజానికి వ్యతిరేకంగా ఖచ్చితమైన ప్రకటనలు చేయడమే కాదు, ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించింది. విజయవాడలో ముస్లిములు ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా మే 7న ర్యాలీ తీశారు. బీహారుకు చెందిన బియస్ఎఫ్ జవాన్ ముహమ్మద్ ఇంతియాజ్ ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందాడు. మే 8వ తేదీన లక్నోలోని ముస్లిం ధర్మవేత్తలు భారత సైన్యాన్ని ప్రశంసించిన వార్త టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చింది. ఇలాంటి వార్తలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి.

కాని అమిత్ షాకు బెంగాల్‌లో హిందూ ముస్లిం రాజకీయాలు చేయాలి కాబట్టి ముస్లిములు ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తారన్న భ్రమను సృష్టించే వ్యాఖ్యలు చేశారు. మమతాబెనర్జీ ముస్లిములను బుజ్జగించడానికి ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తూ, విమర్శించిందని అమిత్ షా చెప్పడానికి ఒకే ఒక్క కారణం దేశంలో హిందూ ముస్లిం చిచ్చు పెట్టాలన్న ఆలోచన. హిందువులను ముస్లిములపై రెచ్చగొట్టి ఎన్నికల లాభాలు దండుకోవాలన్న స్వార్థం.

బీజేపీ నేతలకు అబద్ధాలు చెప్పడం అలవాటు. అలవాటు మాత్రమే కాదు అనివార్యమైన అవసరంగా మారిపోయింది. నిజంగా మమతాబెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకించారా? విమర్శించారా? తృణమూల్ కాంగ్రెస్ స్పష్టంగా ఆపరేషన్ సింధూర్ పక్షాన మాట్లాడింది. పహల్గాం టెర్రర్ దాడిని తీవ్రంగా నిందించడమే కాదు, పాకిస్తాన్ సైనికాధికారులు టెర్రరిస్టుల అంతిమ సంస్కారాలకు హాజరు కావడం చూస్తే పాకిస్తాన్‌కు టెర్రరిజానికి ఎంత గట్టి సంబంధం ఉందో అర్థం కావడం లేదా అని తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ సూటిగా ప్రశ్నించాడు. అయినా అమిత్ షా మాత్రం మమతాబెనర్జీ ఆపరేషన్ సింధూర్ ను విమర్శించారని అంటారు. మమతాబెనర్జీ మాత్రమే కాదు ప్రతిపక్షాలన్నీ ఆపరేషన్ సింధూర్‌ను రాజకీయాలకు వాడుకోవడాన్ని విమర్శిస్తున్నాయి. మోడీ సైనికదుస్తుల్లో ఫోటోలు పెట్టుకుని రాజకీయాల కోసం ఆపరేషన్ సింధూర్ ను ఉపయోగించుకోవడాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారు.

పహల్గాం టెర్రరిస్టులు దేశంలో హిందూ ముస్లిం కల్లోలం, ఘర్షణలు సృష్టించడానికి ఈ దాడులు చేశారన్నది స్పష్టం. కాని దేశంలో ఆ వెంటనే బీజేపీ ట్విటరు హ్యాండిల్ ఒక కార్టూన్ చిత్రంతో ప్రచారం మొదలు పెట్టింది. మతాన్ని అడిగారు, కులాన్ని కాదంటూ బీజేపీ చేసిన ట్వీటును అందరూ ఏవగించుకున్నారు.

పహల్గాం దాడి తర్వాత, పెళ్ళయిన కొద్ది రోజులకే భర్తను కోల్పోయిన హిమాంశీ నర్వాల్ తన భర్త మృతదేహం దగ్గర కూలబడిన దృశ్యాన్ని బీజేపీ చత్తీస్ గఢ్ గిబిలీ చిత్రంగా చేసిన ట్వీటు అది. ఆ తర్వాత హిమాంశీ నర్వాల్ టెర్రరిస్టులకు శిక్ష పడాలని, సాధారణ కశ్మీరీలను, ముస్లిములను ద్వేషించవద్దని చెప్పిన తర్వాత ఆమెపై ట్రోలింగ్ మొదలయ్యింది. ఆమె పాత ఫేస్ బుక్ పోస్టులను కూడా తవ్వి తీసి ట్రోల్ చేశారు. కథువాలో చిన్నారి రేప్ కేసులో దోషులను శిక్షించాలని అప్పట్లో ఆమె రాసిన మాటలను కూడా తవ్వి తీసి ట్రోలింగ్ చేశారు. ఈ ట్రోలింగ్ అసభ్యమైన స్థాయిలో జరిగింది. ఇదంతా మత విద్వేషశక్తుల పని కాదా?

బీజేపీ మంత్రి కున్వర్ విజయ్ షా ఒక సభలో మాట్లాడుతూ కల్నల్ సోఫియా ఖురైషీని టెర్రరిస్టుల సోదరి అన్నాడు. కర్నాటకకు చెందిన బీజేపీ నాయకుడు ఒక ఐఏయస్ అధికారిణి ఫౌజియా తరన్నుమ్‌ను పాకిస్తాన్ నుంచి వచ్చినట్లు కనిపిస్తుందన్నాడు. క్షేమంగా ఉండేందుకు తాను కూడా ముస్లిముల కలిమా నేర్చుకుంటానని బీజేపీ ఎం.పీ. నిశికాంత్ దూబే అన్నాడు. ఈయన గారు ఇప్పుడు విదేశీయాత్రలో హిందూ ముస్లిం అంతా భాయి భాయి అంటున్నాడన్నది వేరే విషయం. కాని భారత భూభాగంలో ఉన్నప్పుడు ఈ నేత చేసిన విద్వేష పూరిత వ్యాఖ్యలు తక్కువేం లేవు. బీజేపీ నేతలు వరుసగా మతవిద్వేష వ్యాఖ్యలు ఎందుకు చేస్తుంటారు?

భోపాల్ బీజేపీ ఎం.పీ. అలోక్ కుమార్ ఏమన్నాడంటే, భోపాల్‌లో చాలా జిమ్‌లు ఉన్నాయి. ఎక్కడెక్కడ ముస్లిము ట్రయినర్లున్నారో లిస్టు తయారు చేస్తున్నారట. ఈ లిస్టును పోలీసులకు ఇస్తారట. ఎందుకంటే, లవ్ జిహాద్‌ను ఆపడానికట. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ లాంటివి జరగనివ్వం అన్నాడు. అసలు లవ్ జిహాద్ ఎక్కడుంది? ఎన్ని కేసులున్నాయి? ప్రభుత్వం నుంచి

అధికారికంగా లవ్ జిహాద్ గురించి ఏమన్నా ప్రకటన ఉందా? ల్యాండ్ జిహాద్ ఏమిటి? ఈ విద్వేష సాగు ఎంతకాలం చేస్తారు?

లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, యుపియస్సీ జిహాద్, మార్కెట్ జిహాద్... ఇలా రకరకాల పేర్లతో జరుగుతున్న ఈ ప్రచార మేమిటి?

ఇటీవల ది క్వింట్‌లో ఒక వ్యాసం వచ్చింది. కేవలం హిందువుల కోసం మాత్రమే జాబ్ పోర్టల్స్ ఎలా నడుస్తున్నాయో వివరించింది. ఇది కేవలం జాబ్ పోర్టల్ మాత్రమే కాదు, హిందూజోన్ పేరుతో మార్కెటు ప్లేసు. ఇందులో కేవలం హిందూ వెండర్ల ఉత్పత్తులు మాత్రమే ఉంటాయి. హిందూ వృత్తి నిపుణుల కోసం లిస్టింగ్. ఇలా చాలా ఉన్నాయి. మహారాష్ట్రలో బీజేపీ కి చెందిన మంత్రిగారు ఈ పోర్టల్‌ను లాంచ్ చేశారు. అంతకు ముందు 2022లో హిందూ లింక్స్ అనే వెబ్ సైటు ఒకటి ప్రారంభమైంది. కేవలం హిందువుల కోసం వారి ఉత్పత్తులు, వారి సర్వీసులను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన డైరెక్టరీ ఇది. హిందూ కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, వర్కర్లు, ఉద్యోగాల అభ్యర్థులు, పెయింటర్లు, డొమెస్టిక్ వర్కర్లు .... ఇలా అందరూ హిందువులే. కేవలం హిందువులను మాత్రమే పనికి తీసుకోవాలనుకునే వారికి ఇది సౌకర్యంగా ఉంటుందని మొదలెట్టారట. అలాంటిదే శూర్ వీర్ ప్రోగ్రామ్ అనే మరో ప్రోగ్రాం గురించి కూడా ది క్వింట్ రాసింది. హిందువుల దగ్గరే కొనండి, హిందువులకే ఉద్యోగాలు ఇవ్వండి. నాన్ హలాల్ ఉత్పత్తులే కొందాం... హిందూ టెక్నీషియన్లనే ఇంటి పనులకు ఉపయోగిద్దాం... హిందూ షాపుల్లోనే కొందాం... అది కూడా హిందువులను మాత్రమే ఉద్యోగులుగా పెట్టుకునే హిందూ షాపుల్లో... మీ కోసం మీ హిందూ ఎకో సిస్టమ్.

ఇలాంటి టెలీగ్రామ్ చానల్ గురించి కూడా ది క్వింట్ రాసింది. ఇదంతా ఏదో హఠాత్తుగా జరగడం లేదు. గత కొంతకాలంగా ముస్లిములను బాయ్‌కాట్ చేయాలన్న పిలుపులిస్తున్నదెవరు?

దేశంలో ముస్లిముల్లో అత్యధికులు స్వయం ఉపాధిపై ఆధారపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేదా ప్రయివేటు ఉద్యోగాలపై ఆధారపడే ముస్లిములు తక్కువ. వడ్రంగం, మాంసం దుకాణాలు, ఆటోమొబైల్ రిపేర్లు వంటి రంగాల్లో ముస్లిములు కనిపిస్తారు. ఈ రంగాల్లో ముస్లిముల వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలు ఈ బాయ్‌కాట్ వల్ల దెబ్బ తింటాయి. ఇది ఒకరకమైన అంటరానితనం కాదా?

గత పదేళ్ళుగా బీజేపీ పరిపాలనలో ముస్లిముల అణిచివేత ఒక పద్ధతి ప్రకారం కొనసాగుతుందనేది నిజం. గోరక్షణ పేరుతో మూకహత్యలు, మూకదాడులు జరుగు తున్నాయి. మే 24న అలీఘర్‌లో జరిగిందేమిటి? గోరక్షక ముఠా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో గోమాంసం ఏదీ దొరకలేదు. ఈ ముఠాలు యథేచ్ఛగా పనిచేస్తున్నాయి.

మరోవైపు ఒక పద్ధతి ప్రకారం ఆర్థికంగా బాయ్ కాట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రూహ్ అఫ్జా గురించి ఇటీవల బాబా రాందేవ్ చేసిన ప్రకటన వివాదం మనందరికీ తెలిసిందే. వ్యవస్థాగతంగా ముస్లిములను ప్రతి రంగంలోను మార్జినలైజ్ చేసే ప్రయత్నాలివి.

పహల్గాం దాడి జరిగిన వెంటనే మతతత్వ విషం చిమ్మడానికి జరిగిన ప్రయత్నాలు కూడా అందరికీ తెలుసు. ఇప్పుడు స్వయంగా హోంమంత్రి, ముస్లిములను బుజ్జగించడానికి మమతా బెనర్జీ ఆపరేషన్ సింధూర్‌ను విమర్శించారంటూ చేసిన వ్యాఖ్య, పరోక్షంగా ముస్లిములు ఆపరేషన్ సింధూర్‌ను వ్యతిరేకిస్తున్నారనే అభిప్రాయం హిందువుల్లో సృష్టించి మతతత్వ విద్వేషం రాజేసే ప్రయత్నం.

బీజేపీ నాయకులు ఈ ప్రయత్నాలు చేయడం సహజమే. ఎందుకంటే, ఈ ప్రయత్నాల ద్వారానే వారు పదేళ్ళుగా అధికారంలో ఉన్నారు. వరుసగా విజయాలు సాధిస్తూ వస్తున్నారు. కాని దేశప్రజలు ఎంతకాలం ఈ మతతత్వ విద్వేష రాజకీయాలను భరిస్తారన్నది ప్రశ్న. ఎంతకాలం ప్రాపగాండను నమ్మేసి ఓట్లేస్తారు?

## ఎంతకాలం ప్రాపగాండను నమ్మేసి ఓట్లేస్తారు?

పుల్వామా ఉగ్రదాడి జరిగింది. మన జవాన్లు 40 మంది మరణించారు. అప్పుడు 340 కిలోల ఆర్డీఎక్స్ ఎలా ఎక్కడి నుంచి అక్కడికి వచ్చిందనే ప్రశ్నకు నేటి వరకు జవాబు లేదు.

అప్పట్లో దేవేందర్ సింగ్ అనే పోలీసు అధికారి ఇద్దరు ఉగ్రవాదులతో కలిసి పట్టుబడ్డాడు. ఆయన ఇద్దరు టెర్రరిస్టులకు సహాయం చేస్తూ పట్టుబడ్డాడు. బిబిసీ వార్త ప్రకారం అరెస్టుకు ముందు దేవేందర్ సింగ్ డిఐజీతో "ఇది పెద్ద గేమ్. సార్ మీరు గేమ్ పాడు చేస్తున్నారు" అన్నాడట. ఇప్పుడా దేవేందర్ సింగ్ కేసు ఏమయ్యింది? పుల్వామా కేసులో దోషులు ఏమయ్యారు?

పుల్వామా దాడి విషయంలో బీజేపీకి చెందిన నాయకుడే అయిన సత్యపాల్ మలిక్ చెప్పిన మాటలేమిటి? ఆయన అప్పుడు జమ్ము కశ్మీర్ గవర్నరుగా ఉండేవారు కదా.

కల్నల్ సోఫియా ఖురైషీని ఉగ్రవాదుల సోదరిగా చెప్పిన విజయ్ షా పై బీజేపీ తీసుకున్న చర్యలేమిటి?

గత పదేళ్లుగా నిరుద్యోగం, అధిక ధరలు తదితర సమస్యల పరిస్థితేమిటి?

ఈ ప్రశ్నలన్నీ ప్రజల ముందున్నాయి. ఈ ప్రశ్నలపై ఆలోచించాల్సిన బాధ్యత ప్రజలదే. ✤




# విమర్శకు ప్రతి విమర్శ బూతులేనా?

## ★ అసభ్య వ్యాఖ్యలకు వేదికలవుతున్న సోషల్ మీడియా

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

ఈ మధ్యకాలంలో అభిప్రాయ స్వేచ్ఛపై చర్చలు ఎక్కువయ్యాయి. అయితే ఆ స్వేచ్ఛకు ప్రామాణిక నిర్వచనం ఇవ్వాల్సిన అవసరం రోజురోజుకీ పెరిగిపోతోంది. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ప్రతి పౌరుడికీ ఉండాలి. కానీ, విమర్శకు బదులుగా అసభ్య వ్యాఖ్యలు చేయడం, బూతులు తిట్టడం, బెదిరింపులు పంపడం, ఇవి అనాగరిక అనుచిత చేష్టలు.

సామాజిక మాధ్యమాల్లో, ప్రభుత్వ విధానాలపై విమర్శలు వ్యక్తమవుతుంటే వాటిని విషయపరంగా ఖండించకుండా, విమర్శించినవారిని వ్యక్తిగతంగా దూషించడం పెద్ద సమస్యగా మారింది. మహిళలపైన, సామాన్య పౌరులపైనా అసభ్య వ్యాఖ్యలు ఎక్కువైపోతున్నాయి. సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సృష్టించగల సోషల్ మీడియాను కొంతమంది ఇలాంటి చిల్లర పనులకు దుర్వినియోగం చేయడం, ఇతరుల స్వేచ్ఛను దెబ్బతీసి, వారి మనోభావాలు గాయపరచడం విచారకరం. సోషల్ మీడియా సంస్థలు ఈ విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు, ప్రభుత్వ వ్యవస్థ మాత్రం తనను ప్రశ్నించే స్వరాలపై నిఘా పెట్టి కేసుల్లో ఇరికించే వరకూ వెళ్తోంది. ఇటీవల కాశ్మీర్‌లోని పహెల్గాం ప్రాంతంలో ఉగ్ర దాడి తర్వాత ప్రజలు కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలు లేవనెత్తారు. మినీ స్విట్జర్‌ల్యాండ్‌గా ప్రసిద్ధి చెందిన బైసారన్ పర్యాటక ప్రదేశాన్ని ప్రతిరోజూ కొన్ని వేలమంది సందర్శిస్తూ ఉంటారు. వేలాది మంది సంచరించే అంతటి సున్నిత ప్రాంతంలో సైనిక బలగాలను ఎందుకు మోహరించలేదు? కనీసం ఒక్క సెక్యూరిటీ కూడా బైసారన్‌లో లేదంటే ఇది భద్రతా వైఫల్యం కాదా? పర్యాటకుల, పౌరుల రక్షణ కోసం తీసుకున్న చర్యలు ఏమిటి? ఇలాంటి అనేక ప్రశ్నలు సహజంగానే పౌర సమాజం నుండి వచ్చాయి. ఈ ప్రశ్నల్ని భరించలేని కొంతమంది దీన్ని దేశద్రోహం కోణంలో చూపిస్తున్నారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో

ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజల హక్కు మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే చర్య కూడా. ప్రజలు లేవనెత్తిన ప్రశ్నల్లో, వారు చేస్తున్న వాదనలో తప్పుంటే విషయపరంగా, బాధ్యతాయుతంగా ఖండించవచ్చు. కానీ ఇప్పుడు జరుగుతున్న దేమిటీ? సంస్కార హీన భాషతో, తిట్ల పురాణంతో, వ్యక్తిగత దూషణల ద్వారా ప్రశ్నను, విమర్శను అణచివేయాలన్న కుట్ర జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం మంచిది కాదు. నిజానికి స్వీకరించాలి. అవి తప్పుడు విమర్శలైతే వాస్తవాలతో ఖండించాలి. యదార్థమేమిటో ప్రజల ముందుంచాలి. ఒకవేళ విమర్శల్లో వాస్తవముంటే, ప్రశ్నల్లో బలముంటే, వాటిని నిశితంగా పరిశీలించాలి. సరిదిద్దుకోవాలి. కానీ దురదృష్టవశాత్తూ, ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాలపై కేసులు, అరెస్టులు జరుగుతున్నాయి. అదే సమయంలో, ప్రశ్నించే గొంతుల్ని అణిచివేయడానికి అశ్లీల, అసభ్య పదజాలాన్ని ఆశ్రయించి, కనీసం మహిళలని కూడా చూడకుండా దుర్భాషలు, బూతు వ్యాఖ్యలతో ట్రోలింగ్ జరుగుతోంది. ఇలాంటి బూతురాయుళ్ళపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నది నిజం. సోషల్ మీడియా సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను నియంత్రించడంలో విఫలమవుతున్నాయి. అనేకమంది పౌరులు తమ స్వేచ్ఛను వినియోగించుకునే క్రమంలో కొన్ని కీలక ప్రశ్నలు లేవనెత్తుతున్న విషయం నిజం. అయితే ప్రతిస్పందన ఇంగితంతో, బాధ్యతాయుతంగా, సంస్కారవంతంగా ఉంటే ఏ ఇబ్బందీ లేదు. కాని కొంతమంది రాయడానికి, పలకడానికి కూడా వీలు లేని అసభ్యకర భాషతో బూతులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఇటువంటి దుర్మార్గులకు కళ్ళెం వేసేదెవరు? ఫేస్‌బుక్ లాంటి సంస్థలు ఇలాంటి దుర్మార్గాలపై స్పందించవా? చర్యలు తీసుకోవా? వాటికి బాధ్యత లేదా? సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయాలంటారు కొందరు. అది అందరికీ సాధ్యమయ్యే విషయమేనా?

ఈ విషయంలో ప్రభుత్వ నిఘా వర్గాలు స్పందించాలి. ఉచ్చ నీచాలు మరిచిపోయి అత్యంత హేయమైన, జుగుప్సాకరమైన పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, మార్ఫింగ్ వీడియోలు, చిత్రాలతో దాడి చేస్తున్న ఉన్మాద మూకలకు తగిన శిక్షలు పడాలి. నిజానికి భారతీయ న్యాయ సంహితలో ఇలాంటి నేరాలకు శిక్షలు ఉన్నాయి. అసభ్య పోస్టులతో తాము ఎంతలా పేట్రేగిపోయినా పోలీసులు, చట్టాలు ఏమీ చేయలేవని, మహా అయితే అరెస్టు చేసి నోటీసులు ఇచ్చి వదిలేస్తారని, అంతకు మించి ఏమీ కాదంటూ రోజు రోజుకు రెచ్చిపోతున్న సైబర్ ఉగ్రవాదులపై ఈ చట్టం ప్రకారం ఉక్కుపాదం మోపేందుకు పోలీసులకు అధికారం ఉంది. అయినా ఈ అసభ్య రాయుళు ్ళ భయపడడం లేదు. ఇలాంటి పోస్టులు పెట్టిన కొంతమందిని అక్కడక్కడా అరెస్టులు చేయడం, శిక్షలు వేయడం జరుగుతున్నా అసభ్య, అనుచిత వ్యాఖ్యలు ఆగడం లేదు. అంటే, కేసుల తీవ్రత, శిక్షల తీవ్రత కావలసినంత స్థాయిలో ప్రచారం జరగడం లేదన్న మాట. మరో విషయం ఏమిటంటే, టెక్నాలజీ పరంగా సమాజం ఇంతలా దూసుకుపోతున్నప్పటికీ నైతిక విలువల పరంగా పట్టింపులేనితనం ఎక్కువవుతోంది. ఎవర్నయినా ఒకమాట అనే ముందు ఇది ఉచితమా.. అనుచితమా? అని ఆలోచించే పరిస్థితి లేదు. ఇలాంటి మానసిక స్థితికి లోనైనవారు విలువల పరంగా ఎంత దిగజారిపోయారో అర్థమవుతోంది. కనుక సమాజంలో విలువల పెంపుదల వైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ, తమ వంతు ప్రయత్నంగా ఈ దుస్సం ప్రదాయ నివారణకు కృషి చేయాలి. పౌరసమాజం, మానవ హక్కుల సంఘాలు, వ్యక్తిగతంగా పౌరులు కూడా స్పందించి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిని సంస్కరించే ప్రయత్నంతో పాటు, అలాంటి వారిపై కేసులు కూడా నమోదయ్యేలా చూడాలి. ఒకరిద్దరికి కఠిన శిక్షలు పడి, తగినంత స్థాయిలో ప్రచారం పొందితే, కామెంట్ చేసేటప్పుడు ఎవరైనా ఒళ్ళుదగ్గర పెట్టు కుంటారు. అడిగేవాడు, ప్రశ్నించేవాడు, శిక్షించేవాడు ఎవరూ లేకపోతే నోటికెంతొస్తే అంత వాగుతారు. చేతికెంతొస్తే అంత రాస్తారు. ఇకపోతే, ఎవరికి వారు ఇంగితంతో వ్యవహరించి, సభ్యతా సంస్కారాలను ప్రోత్సహించాలి. సద్విమర్శ, అభిప్రాయ భేదం చాలా సహజం, కానీ అది వ్యక్తిగత దాడిగా మారకుండా జాగ్రత్త వహించాలి. అభిప్రాయ స్వేచ్ఛ అనేది ఒక మౌలిక హక్కు. కానీ అది అసభ్యత, అశ్లీలతకు వేదికగా మారితే, సమాజంగా మనం వెనుకబడుతున్నదానికి సంకేతం. విమర్శను ఎదుర్కోవాలంటే సాహసం కావాలి. విమర్శకు బదులుగా బూతులు మాట్లాడే ధోరణికి వ్యతిరేకంగా నిలబడే నైతిక బలమూ, చైతన్యమూ అవసరం.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించాలి. అసభ్యతకు స్థానం ఉండకూడదు. సామాజిక మాధ్యమ వేదికలు వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగపడాలి. వ్యక్తిత్వాన్ని అవమానించే స్థాయికి దిగజార కూడదు. ఇది కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాదు అది మన ప్రజాస్వామ్య నిర్మాణానికి పునాది. వ్యక్తి మౌలిక హక్కును హరిస్తే, సమాజం పునాది కదలు తుంది. కనుక అభిప్రాయ స్వేచ్ఛను గౌరవిస్తూ, అసభ్యతకు కత్తెర వేయాల్సిన బాధ్యత మనందరిదీ. ✤




**- డా. సాజిద్ అబ్బాసీ**

### బలిదానం అంటే ఏమిటి?

ఇస్లాంలో త్యాగం, బలిదానాల భావన ఎంతో ఉన్నతమైనది. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) త్యాగమయ జీవితం దీనికి గొప్ప ఉదాహరణ. ఈదుల్ అజ్హాను ఖుర్బానీ పండుగ అని కూడా పిలుస్తారు. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) అల్లాహ్ ఆదేశంపై తన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స)ను బలి ఇవ్వడానికి పూనుకున్న అసాధారణమైన గొప్ప సంఘటనను గుర్తు చేస్తుంది ఈ పండుగ. అల్లాహ్ ఖురాన్‌లో త్యాగం లేదా బలిదానాన్ని ఇలా వివరించాడు:

> **"మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంతవరకు మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు."**
>
> **(ఆలె ఇమ్రాన్: 92)**

సత్కార్యాల సారం త్యాగభావన అని ఈ వాక్యానికి భావార్థం. ఈ త్యాగనిరతి ఎంత ఎక్కువగా ఉంటే, సత్కార్య ప్రమాణం అంతే ఎక్కువగా ఉంటుంది. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) తన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స)ను అల్లాహ్ మార్గంలో బలి ఇస్తున్నట్లు కలలో చూశారు. ప్రవక్తల కలలు దైవవాణి స్థాయిని కలిగి ఉంటాయి. అందువల్ల, ఆయన దైవాదేశాన్ని పాటించడానికి నిశ్చయించుకున్నారు. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స) కూడా విధేయత చూపించి ఇలా అన్నారు: ''నాన్న గారూ! మీకు ఆజ్ఞాపించబడిన దాన్ని నెరవేర్చండి. అల్లాహ్ సంకల్పిస్తే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు.'' (సాఫ్ఫాత్: 102)

తండ్రీ కొడుకులిద్దరూ సంపూర్ణ దైవవిధేయతకు, అల్లాహ్ నిర్ణయాల పట్ల పూర్తి ఒప్పుకోలుకు చిహ్నంగా మారారు. అల్లాహ్ ఈ త్యాగాన్ని గొప్పగా ఆదరించాడు. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స) స్థానంలో ఒక పొట్టేలును పంపడం ద్వారా స్వీకరించాడు. ఈ సంఘటనను శాశ్వత సంప్రదాయంగా మార్చాడు. ఇస్లాంలో త్యాగం, బలిదానం అంటే కేవలం జంతువులను బలి ఇవ్వడం కాదు, ఇది ఒక చిహ్నం మాత్రమే. దాసుడు అల్లాహ్ ఆనందం కోసం తనకు అత్యంత విలువైనది కూడా త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని మనిషికి స్ఫూర్తినిచ్చే సంకేతమిది. పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఇలా చెప్పాడు: "వాటి మాంసమూ అల్లాహ్‌కు చేరదు, వాటి రక్తమూ చేరదు. కాని మీ భయభక్తులు ఆయనకు చేరుతాయి.'' (అల్ హజ్ : 37) ఈ వాక్యం వల్ల అల్లాహ్ ఎవరిపైనను, దేనిపైనను ఆధారపడి లేడన్నది తెలుస్తుంది. ఆయనకు ఎవరి త్యాగం అవసరం లేదు. తన పట్ల ప్రేమతో

దాసుడు తనకు ప్రియమైన వస్తువును అల్లాహ్ ప్రసన్నత కోసం త్యాగం చేయాలనే స్ఫూర్తిని చూస్తాడు. దాన్నే భయభక్తులుగా అభివర్ణించడం జరిగింది. ఈ భయభక్తులు అల్లాహ్‌కు చేరుతాయి. మాంసం అల్లాహ్‌కు చేరదు, మాంసం అల్లాహ్ దాసులకు చేరుతుంది. ఇస్లాంలో అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం అంటే భావం, ఎవరైనా అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లించాలనుకుంటే, అల్లాహ్ ఇచ్చిన సంపదను ఇతరుల కోసం, అవసరాల్లో, కష్టాల్లో ఉన్నవారి కోసం ఖర్చు చేయాలి. అల్లాహ్‌కు ఏదీ అవసరం లేదు. ఆయన నిరపేక్షా పరుడు, ఎవరి అవసరమూ లేనివాడు.

ఈదుల్ అజ్హా అనేది సంతోషాల పండుగ సందర్భం. మనకు ఇస్లాం లాంటి జీవన విధానం లభించింది. దాని ద్వారా హజ్రత్ ఇబ్రాహీం (అ.స) వంటి గొప్ప వ్యక్తితో అనుబంధం ఏర్పడింది (హజ్: 78). హజ్రత్ ఇబ్రాహీం (అ.స) జీవితం మొత్తం అల్లాహ్ పట్ల అంకితభావం, సంతృప్తి, త్యాగనిరతి. త్యాగభావన ఏమిటంటే, మనం సృష్టికర్త అనుగ్రహాలను గుర్తించి, కృతజ్ఞతా భావంతో, దైవప్రేమతో, ఆయన కోసం ఏదైనా త్యాగం చేయాలనే స్ఫూర్తిని పెంపొందించుకోవడం.

అతిపెద్ద అనుగ్రహం అల్లాహ్ ప్రసాదించిన జీవితం. రెండవది మనకు అల్లాహ్ ఇచ్చిన బుద్ధీ వివేకాలు. మూడవ అనుగ్రహం దైవం పట్ల విశ్వాసం (ఈమాన్). నాల్గవ అనుగ్రహం మనకు లభించిన ఆరోగ్యం. ఐదవది జ్ఞానం. ఇవి అల్లాహ్ ప్రసాదించిన ముఖ్యమైన అనుగ్రహాలు. వీటితో పాటు ఇతర అనుగ్రహాలు అనేకం.

"ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే, లెక్కించ లేరు. యథార్థమేమిటంటే ఆయన ఎంతో మన్నించేవాడూ, కరుణామయుడూను." (నహ్ల్: 18). హజ్రత్ ఇబ్రాహీం (అ.స)లో అల్లాహ్ ప్రసన్నత కోసం ఉన్నటువంటి గొప్ప త్యాగనిరతి ఆయనకు అల్లాహ్ పట్ల ఉన్న అపారమైన ప్రేమ వల్లనే జనించింది. ప్రేమభావన అత్యంత కృతజ్ఞతా భావన నుంచి జనిస్తుంది. ఈ విషయాన్ని ఖురాన్ హజ్రత్ ఇబ్రాహీం (అ.స) మాటల్లో ఇలా చెప్పింది:

"అల్లాహ్ నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురి అయినప్పుడు, ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును కలిగిస్తాడు. తరువాత మళ్లీ నాకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పు దినం నాడు నా

**"అల్లాహ్ నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురి అయినప్పుడు, ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును కలిగిస్తాడు. తరువాత మళ్లీ నాకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పు దినం నాడు నా పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీద ఆశలు పెట్టుకున్నాను."**

పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీద ఆశలు పెట్టుకున్నాను." (అష్-షుఅరా: 78-82). మనం కూడా అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించాలి. ఆయన మనల్ని ఉత్తమమైన ప్రాణి అంటే మనిషిగా సృష్టించాడు. ముస్లిముగా చేశాడు. ఇహపరలోకాల శ్రేయస్సు , సాఫల్యాలను ప్రసాదించే దైవవిశ్వాస భాగ్యాన్నిచ్చాడు. మనకు ఆరోగ్యాన్నిచ్చాడు. ప్రమాదాల నుండి కాపాడాడు. ధనప్రాణ ఆస్తి గౌరవాల రక్షణకు ఏర్పాట్లు చేశాడు. శాంతి భద్రతలను ప్రసాదించాడు. ఇవే కాదు మనం లెక్కించలేనన్ని అనుగ్రహాలు కూడా ప్రసాదించాడు. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) అల్లాహ్ అనుగ్రహాలను గుర్తుంచుకొని తన హృదయంలో అల్లాహ్ పట్ల ప్రేమ భావాన్ని నింపుకున్నట్లే, మనం కూడా ఈ ఇబ్రాహీం (అ.స) సంప్రదాయాన్ని పాటించాలి. మన హృదయం అల్లాహ్ ప్రేమతో నిండిపోతే మనకు అల్లాహ్ కన్నా ఎక్కువ మరేదీ కాదు. అల్లాహ్ ప్రేమలో మనకు ఎంత ఇష్టమైనదైనాసరే త్యాగం చేయడానికి ఉత్సుకత పెరుగుతుంది.

అందువల్ల బక్రీద్ పండుగ కేవలం ఆనందం, మాంసాహారం, సంబరాల రోజు కాదు. త్యాగం, నిస్వార్థ సేవ, దైవవిధేయతల రోజు. ఈ రోజు సందేశం ఏమిటంటే, హజ్రత్ ఇబ్రాహీం (అ.స) జీవితం నుండి పాఠాలు నేర్చుకోవడం. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) మొదట దేవుడు ఒకే ఒక్కడనే ఏకదైవారాధన సందేశాన్ని ప్రజలకు అందించడానికి జీవితం అంకితం చేసుకున్నారు. ఫలితంగా మొదట తండ్రి వ్యతిరేకించారు, తరువాత సమాజం వ్యతిరేకించింది. పిదప రాజు (నమ్రూద్) ముందు ఏకదైవారాధన గురించి చెప్పినప్పుడు ఆయన్ను అగ్నిగుండంలో పారేయాలని ఆదేశించాడు. అల్లాహ్ అగ్నిని పూలపాన్పు చేశాడు. మొదటి పరీక్ష ఏమిటంటే, ఆయన మండుతున్న అగ్నిలో పడడానికి సిద్ధమయ్యారు. ప్రాణత్యాగానికి వెనుకాడలేదు. అల్లాహ్ ఆయన్ను

కాపాడాడు. ఆ తర్వాత ఆయన అల్లాహ్ కోసం తండ్రిని, కుటుంబాన్ని, దేశాన్ని విడిచిపెట్టారు. రెండవ గొప్ప పరీక్ష ఏమిటంటే, అల్లాహ్ ఆదేశంపై ఆయన తన భార్యను, పసిబిడ్డను చుక్కనీరు లేని నిర్జన లోయలో విడిచిపెట్టారు. మూడవ పరీక్ష ఏమిటంటే, ఇస్మాయీల్ (అ.స) తన వృద్ధ తండ్రికి చేదోడుగా నిలిచే వయస్సుకి చేరుకున్నప్పుడు, ఆయన్ను బలి ఇవ్వమని ఆదేశం వచ్చింది. ఈ మూడు పరీక్షలలో విజయం సాధించిన తరువాత, అల్లాహ్ ఆయన్ను మానవాళికి నాయకుడిగా చేశాడు. హజ్రత్ ఇబ్రాహీం (అ.స) జీవితం ఏమి తెలియజేస్తుందంటే, అల్లాహ్ కోరినప్పుడు ఒక ముస్లిం తన అత్యంత విలువైన వస్తువును, చివరికి తన ప్రాణాన్ని, తన పిల్లలను కూడా అల్లాహ్ ప్రేమలో త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి. త్యాగం ధనప్రాణాలకు సంబంధించినది కావచ్చు, ఇది అత్యున్నత స్థాయి త్యాగం. కానీ రోజువారీ జీవితంలో, అనేక ఇతర విషయాలు త్యాగం చేయవలసి రావచ్చు. ఉదాహరణకు, మన అహం, కోపం త్యాగం చేయడం, మనోవాంఛల త్యాగం.

సత్యం కోసం తండ్రితాతలను లేదా తన సమాజాన్ని, తన పార్టీ పద్ధతులను త్యాగం చేయడం, ఖురాన్, సున్నత్‌లకు విరుద్ధంగా ఉన్న ఆచారాలను త్యాగం చేయడం, సామూహిక ప్రయోజనం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను త్యాగం చేయడం వంటివి. ముస్లిం సముదాయం ఈ చిన్న చిన్న త్యాగాలకు వెనుకాడకుండా ఉన్నట్లయితే ఈ రోజు భారతదేశంలో ముస్లింల భవిష్యత్తు ఇంత నిరాశాజనకంగా ఉండేది కాదు. మత పెద్దలు, రాజకీయ నాయకులు అహాన్ని వదులుకోనందువల్లనే సమాజం చీలిపోయింది. దేశంలో ముస్లింలకు సరైన నాయకత్వం లేకుండా పోయింది.

## పాలస్తీనియన్ల త్యాగాలు:

ఈదుల్ అజ్హా సందర్భంగా త్యాగభావనను పాలస్తీనియన్లు, గాజా ప్రజలు చేస్తున్న త్యాగాల నేపథ్యంలో కూడా చూడాలి. మనం ఇక్కడ ఈ ఖుర్బానీ పండుగ చేసుకుంటున్నాం కాని, ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో ముస్లింలు ప్రతిరోజూ ఈ త్యాగ భావాన్ని ఆచరణలో సజీవంగా అమలు చేసి చూపిస్తున్నారు. అత్యంత ప్రముఖ ఉదాహరణ పాలస్తీనియన్లు, ముఖ్యంగా గాజా ప్రజలు. తమ ఇళ్లను, పిల్లలను, ప్రాణాలను, ప్రాథమిక అవసరాలను అల్లాహ్ ప్రసన్నత కోసం, ధర్మం కోసం, మొదటి కిబ్లా కోసం, సత్యం కోసం త్యాగం చేస్తున్నారు. హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స)ల దైవవిధేయత, దైవనిర్ణయాల పట్ల సంతృప్తిని తమ జీవితాల్లో ప్రతిఫలిస్తున్నారు. గాజా ప్రజలు చాలా

**ఈ క్లిష్టకాలంలో కూడా వారు నమాజ్ చేస్తున్నారు. తమ పిల్లల ప్రాణాలు పోతున్నా అల్లాహ్ వారికి అమరత్వ గౌరవాన్ని ప్రసాదించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆహారం, నీరు, విద్యుత్, ఔషధాలు ఏమీ లేకపోయినా సహనం వహిస్తున్నారు. గాజా ప్రజలు వలస వెళ్లి సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగలిగేవారు. కానీ వారు ప్రవక్తల భూమికి వారసులు, మస్జిద్ అల్-అక్సా సంరక్షణ బాధ్యత తమదిగా భావిస్తున్నారు. కాబట్టి, తమ ప్రాణాలు, అమాయక పిల్లల ప్రాణాలను త్యాగం చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఈ గొప్ప బాధ్యత నిర్వర్తించే గౌరవాన్ని వదులుకోవడం లేదు. మగవాళ్ళు, మహిళలు, పిల్లలు కూడా సహనస్థైర్యాలతో నిలబడుతున్న ఈ శక్తిని చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోంది.**

కాలంగా ముట్టడిలో జీవిస్తున్నారు, వారు ఒక బహిరంగ జైలులో నివసిస్తున్నారు. ప్రాథమిక జీవన అవసరాలు కూడా వారికి శత్రువు అనుమతితోనే లభిస్తాయి.

అక్టోబర్ 7, 2023న గాజాలోని హమాస్ సంస్థ తమ ప్రజలను బానిసత్వ సంకెళ్ళ నుండి శాశ్వతంగా విముక్తి చేయాలని నిర్ణయించింది. పాలస్తీనా స్వాతంత్ర్యం పొందాలి లేదా పాలస్తీనియన్లందరూ అమరులు కావాలని సంకల్పించారు. అమాయక పాలస్తీనియన్లను జైళ్ల నుండి విడిపించడానికి కొందరు యూదులను అపహరించారు. దీన్ని సాకుగా చేసుకొని హమాస్‌పై దాడి పేరుతో అమాయక పౌరులు, మహిళలు, పిల్లలపై బాంబులు వేసి ఇస్రాయీల్ చంపుతోంది. వారి భవనాలు, పాఠశాలలు, మసీదులు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఈ క్లిష్టకాలంలో కూడా వారు నమాజ్ చేస్తున్నారు. తమ పిల్లల ప్రాణాలు పోతున్నా అల్లాహ్ వారికి అమరత్వ గౌరవాన్ని ప్రసాదించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆహారం, నీరు, విద్యుత్, ఔషధాలు ఏమీ లేకపోయినా సహనం

వహిస్తున్నారు. గాజా ప్రజలు వలస వెళ్లి సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగలిగేవారు. కానీ వారు ప్రవక్తల భూమికి వారసులు, మస్జిద్ అల్-అక్సా సంరక్షణ బాధ్యత తమదిగా భావిస్తున్నారు. కాబట్టి, తమ ప్రాణాలు, అమాయక పిల్లల ప్రాణాలను త్యాగం చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఈ గొప్ప బాధ్యత నిర్వర్తించే గౌరవాన్ని వదులుకోవడం లేదు. మగవాళ్ళు, మహిళలు, పిల్లలు కూడా సహనస్థయిర్యాలతో నిలబడుతున్న ఈ శక్తిని చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోంది.

ఇస్లాం విశ్వాస శక్తి వాస్తవికతను అర్థం చేసుకున్న వారు ఇస్లాం వైపు ఆకర్షితులవుతున్నారు. గాజాలో త్యాగం, నిస్వార్థ సేవ దృశ్యాలను చూసి ఇస్లాం స్వీకరిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. పాలస్తీనియన్లు, గాజా ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, వారు దైవప్రసన్నత కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేస్తున్నారని తెలుస్తుంది. తమ తాత్కాలిక జీవితాన్ని త్యాగం చేసిన దానికి బదులుగా చాలా విలువైనది లభిస్తుందని విశ్వసిస్తున్నారు. అదే శాశ్వత పరలోకం.

బాహ్యంగా వారు ప్రపంచంలో జీవిస్తున్నారు, కానీ పరలోకం కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడ తమ వంతు కోసం వేచి ఉన్నారు. వాస్తవానికి ప్రపంచంలో పరలోకం కోసం జీవిస్తున్నారు. మరోవైపు, వారికి అల్లాహ్ పట్ల అపారమైన ప్రేమ ఉంది. అల్లాహ్ వారిని ప్రపంచంలో అత్యంత తీవ్రమైన పరీక్షకు గురిచేసాడంటే, అది తమ పట్ల అల్లాహ్ ప్రత్యేక అనుగ్రహం వల్లనే అని వారు భావిస్తారు. అల్లాహ్ వారిని ఉన్నత స్వర్గ స్థానాలకు అర్హులుగా చేయాలనుకుంటున్నాడు కాబట్టి, అల్లాహ్ వారిని అసాధారణమైన కష్టాల పరిస్థితుల్లో నడుపుతున్నాడని వారికి తెలుసు. స్వర్గంలో ఉన్నత స్థానాలకు అర్హులెవరో అల్లాహ్‌కు తెలుసు. ఆ అర్హతకు తగినట్లుగా, అల్లాహ్ అలాంటి వ్యక్తులను సహన స్థయిర్యాల ప్రమాదకరమైన లోయల్లో నడుపుతాడు.

అదేవిధంగా, నరకంలో బాధాకరమైన ప్రదేశాలకు అర్హులైన క్రూరులకు, అణచివేత అవకాశాలను కల్పిస్తాడు. అల్లాహ్ ఎవరు ఎలాంటి వారో అలాంటి చర్యలకు అవకాశాలను కల్పిస్తాడు, తద్వారా సహనం వహించేవారు ఉన్నతమైన సహనాన్ని పాటించే అవకాశాలు లభిస్తాయి. క్రూరులు, దుర్మార్గులకు అణచివేతలకు పాల్పడే అవకాశాలు లభిస్తాయి. ఆ విధంగా తమ వంతు శిక్షకు పాత్రులయ్యే మార్గాలు తెరుచుకుంటాయి. ఈ సూత్రంపైనే అల్లాహ్ ఈ ప్రపంచ వ్యవస్థను నడుపుతున్నాడు. నేడు జియోనిస్టులు, జాతి వివక్ష ఉన్మాదంతో అమాయక పిల్లలను క్రూరంగా చంపుతున్నారు. బాంబు దాడులతో పాటు, ఆకలి దప్పులను కూడా ఆయుధాలుగా చేసుకున్నారు. ఇబ్రాహీం, హాజిరా ఇస్మాయీల్ (అ.స) త్యాగాల నుండి నేటి గాజా ముస్లింల త్యాగాల వరకు రెండు ముఖ్యమైన ప్రేరణలున్నాయి. అవి అల్లాహ్ పట్ల అపారమైన ప్రేమ, పరలోకం గురించి అభిలాష. ఈ ఆధునిక యుగంలో త్యాగానికి సంబంధించిన ఈ గొప్ప ఉదాహరణ నుండి మనం పాఠాలు నేర్చుకుందాం. మన జీవితాల్లో నిస్వార్థ సేవ, త్యాగం, సత్యాల కోసం సహన స్థయిర్యాలు ప్రదర్శిద్దాం. కనీసం మనం పాలస్తీనియన్లకు సంఘీభావాన్ని తెలియజేయాలి, వారి కోసం ప్రార్థించాలి, వారికి ఆర్థిక సహాయం అందించాలి, పాలస్తీనా సమస్యకు సంబంధించి రాజకీయ చైతన్యాన్ని మేల్కొల్పడాన్ని మన బాధ్యతగా భావించాలి.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

5

# మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర) ఇస్లామ్ స్వీకరించిన తరువాత ఆయన ఉద్బోధనం, ఉపదేశం, మూలంగా తొల్దొలి రోజుల్లోనే ఇస్లామ్ సందేశాన్ని స్వీకరించిన తొమ్మండుగురు శుభాత్ములు వీరు:

మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (ర)
మహనీయ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర)
మహనీయ జుబైర్ బిన్ అవ్వామ్ (ర)
మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (ర)
మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (ర)
మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (ర)
మహనీయ ఉస్మాన్ బిన్ మజ్ఊన్(ర)
మహనీయ అబూ సలమా బిన్ అబ్దుల్ అసద్(ర)
మహనీయ అర్కమ్ బిన్ అబుల్ అర్కమ్ (ర)

★★★

ఈ మహనీయులంతా ఇస్లామీయ ఉద్యమాన్ని అన్ని దశల్లోనూ సకల విధాలా కృషి సలిపి విజయవంతం చేసిన వారు.

## సత్య ధర్మం పైన సుస్థిరత

ఈ ఉల్లేఖనం ప్రకారం మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (ర) ఇస్లామ్ ఆవిర్భావం ప్రారంభ దశలోనే ధర్మ సందేశాన్ని స్వీకరించి ధన్యులయినవారు. అప్పుడు ఆయన వయసు పదిహేనేళ్ళు. ఆ నవ యువకుడు ఇస్లామ్ స్వీకరించడం ఆయన సంపన్న కుటుంబంలో ఆందోళనకు కారణం అయింది. ఆ యువకుడు తెగకు నాయకుడు కావలసిన వాడు ఇలా ధర్మ భ్రష్టుడయితే ఎలా? అన్నది వారి చింత. తెగలోని పెద్దలు ఆయనకు సకల విధాలా నచ్చ జెప్పి చూశారు. ఆయన ఏ మాత్రం కదల లేదు. ఇక కుదరదని హింసా దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అయినా ఆయన్ని సత్య ధర్మం నుంచి కదలించలేకపోయారు.

కాలం బిరబిరా ముందుకు సాగింది, ఇస్లామ్ సందేశ ఉద్యమం అనేక దశలు దాటుకుంటూ కొనసాగుతోంది. మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ విశ్వాసం కూడా పరిపూర్ణత వైపునకు పురోగమిస్తోంది. దైవం, దైవ ప్రవక్త మార్గంలో ఆయన పరీక్షలు మరీ దీర్ఘమవసాగాయి. అదేవిధంగా

ఇస్లామ్, ముస్లిముల పట్ల మహనీయ తల్హా సద్వర్తనం పరిధి కూడా విస్తృతమవ సాగింది.

ఇస్లామ్ స్వీకరించిన తరువాత పదమూడేళ్ళ వరకు ఖురైషీల హింసాకాండను భరించిన వారిలో ఈయన కూడా ఉన్నారు. పరుల వేధింపులకు మాత్రమే కాదు తమవారి హేళనకూ గురయ్యారు. అన్నింటినీ సహించడమే కాక ధర్మ ప్రచార కార్యక్రమంలో పూర్తిగా పాల్గొన్నారు. పల్లెవాసుల గుడారాల లోకి వెళ్ళి సత్యధర్మ ప్రచార కార్యం నిర్వహించేవారు. మక్కాలో కడచిన విపత్కర కాలంలో ఏ క్షణాన కూడా ధైర్యం సడలి వెనుకంజ వేయలేదు.

## హిజ్రత్

ప్రవక్త మహనీయుల్ని(స), మహనీయ అబూ బక్ర్(ర)నీ యస్రిబ్ (మదీనా) చేర్చి మక్కా తిరిగి వచ్చిన ఉరైకిత్ మహనీయ అబూ బక్ర్ తనయుడు అబ్దుల్లాకు దారి వివరాలు, మదీనాలో బస ఇత్యాది విషయాలు సయితం తెలిపాడు. ఇంకా కుటుంబ సభ్యుల్ని అందరినీ వెంట తీసుకుని మదీనాకు బయలుదేరవలసిందని మహనీయ అబూ బక్ర్ ఇచ్చిన సందేశాన్ని అందజేశాడు. అబ్దుల్లా బిన్ అబూ బక్ర్ ఆ ఏర్పాట్లలో ఉండగానే ఆయనకు మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్(ర) కలిశారు. ఇరువురు మాటలాడుకుని కలసి బయలుదేరాలని నిర్ణయించుకున్నారు.

రెండు రోజుల తరువాత ఈ బృందం కూడా మహనీయ తల్హా నాయకత్వంలో మక్కా నుండి మదీనాకు బయలు దేరింది. వీరిలో అబూ బక్ర్ తనయులు మహనీయులు అబ్దుల్లా, అబ్దుర్రహ్మాన్, అబ్దుల్లా తల్లి, సవతి తల్లి ఉమ్మె రూమాన్, తనయ ఆయిషా ఉన్నారు. ఈ కుటుంబంతోపాటు మహనీయ సుహైబ్ బిన్ సనాన్ కూడా ఉన్నారు. వారు మదీనా పొలిమేరల్లో ఖారిజా బిన్ జైద్ ఇంట దిగారు. మహనీయ అబూ బక్ర్ అక్కడే బస చేసేవారు. ఆ పైన మహనీయులు తల్హా, సుహైబ్ అసఅద్ బిన్ జిరారహ్ ఇంట బస చేశారు. ప్రవక్తశ్రీ(స) మహనీయ తల్హా సోదరత్వం, మహనీయ కఅబ్ బిన్ మాలిక్(ర)తో చేయించారు. ఆ సోదరత్వం ఎంత గాఢంగా రూపొందింది అంటే వారిరువురి ప్రేమానురాగాలు చూసి నిజమయిన సోదరులు ఈర్ష్య చెందేవారు.

బద్ర్ పోరాటంలో పాల్గొన్న ముస్లిమ్ యోధుల పట్టికలో మహనీయ తల్హా పేరు కానరాదు, కారణం, ప్రవక్తశ్రీ(స) ఆయన్ని ముస్లిముల బస్తీల వైపునకు వెడుతున్న వైరుల సమాచారం అందజేసే గూఢచారులతోపాటు పంపారు. అంటే ఆయన కూడా పరోక్షంగా పోరాటంలో పాల్గొన్న వారిలో చేరి ఉన్నారన్న మాట. హిజ్రీ 3వ సంవత్సరం, మదీనాకు నాలుగు మైళ్ళ దూరాన ఉహుద్ లోయలో ఖురైషీలకు ప్రతిగా మదీనా రక్షణ కొరకు రెండవసారి పోరు సలప వలసి వచ్చినప్పుడు మహనీయ తల్హా(ర) అనుపమ శౌర్యం, త్యాగ నిరతి ప్రదర్శించారు. ఓ విధంగా ఆయన ఉహుద్ పోరు హీరో అని చెప్పవచ్చు. వివరాలు చూద్దాము:

## త్యాగ నిరతి

ఉహుద్ పోరాటంలో ఒక దశలో శత్రువులు పలాయనమయ్యారని తలచి కొందరు ముస్లిమ్ సైనికులు యుద్ధ ప్రాప్తిని ప్రోగు చేయడంలో నిమగ్నమయినప్పుడు దైవ ప్రవక్త రక్షణార్థం ఆయన(స) ఉన్న కొండ కనుమ వద్ద రక్షణ వలయంగా నిలిచిన త్యాగనిరతి గల యోధుల్లో మహనీయ తల్హా(ర) కూడా ఉన్నారు. ఎందరో త్యాగశీలురు ఆ కొండ కనుమ ద్వారం వద్ద తమ ప్రాణాలను సయితం కోల్పోయారు. కొందరు శత్రువుల పైన అంబుల వర్షం కురిపిస్తున్నారు. మహనీయ తల్హా ఒక చేతిలో కరవాలం మరో చేతిలో బల్లెం పట్టుకుని ఆ కనుమ వైపునకు వస్తున్న వారిని అడ్డుకుంటున్నారు. ఆ సందర్భంలో మహనీయ తల్హాకు 57 గాయాలయ్యాయి, ఒక చెయ్యి దాదాపు భుజం నుంచి వేరయి పోయి వ్రేలాడుతోంది.

ఆ స్థితిలోనే ఆయన శత్రువుల్ని చాలా దూరం వరకు తరిమి కొట్టారు. ఆ పైన ఆయన తిరిగి చూస్తే శత్రువులు ముస్లిములకు హాని కలిగించేందుకు త్రవ్విన ఓ గుంటలో ప్రవక్తశ్రీ(స) కాలు జారి పడిపోయారని గమనించారు. మహనీయ తల్హా గుంటలో దుమికి తన ప్రియతమ నాయకుణ్ణి బయటికి తీశారు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స) కొండనెక్కే ప్రయత్నం చేస్తూ కనిపించారు. కాని కవచం వల్ల ఎక్కడం కష్టమవుతోంది. అయితే ప్రవక్త ప్రేమాభిమానం వల్ల మహనీయ తల్హా అది చూడలేకపోయారు. తన శరీరం పైన 57 గాయాలు, ఒక చెయ్యి వ్రేలాడుతూ ఉన్నా ఖాతరు చేయక వెళ్ళి క్రింద కూర్చున్నారు. ప్రవక్తశ్రీని వీపు మీద ఎక్కించుకుని నిలబడ్డారు, అప్పుడు ఆయన(స) కొండ ఎక్కేశారు.

ఉహుద్ రోజున మహనీయ తల్హా(ర) ప్రదర్శించిన శౌర్యం,

పరాక్రమం, త్యాగం జనుల మస్తిష్కాలలో సదా నిలిచి పోయాయి. ఈ సందర్భంలో మహనీయ అబూ ఉస్మాన్ సాక్ష్యం వినదగినది:

ప్రవక్త మహనీయులు(స) ఏ ఏ పోరుల్లో పాల్గొన్నారో వాటిలో కొన్నింటిని గురించి మహనీయులు తల్హా, సఅద్‌కు సంబంధించిన కథనాలే జనాల ఆంతర్యాల్లో భద్రంగా ఉండిపోయాయి.

## నిజ విశ్వాసం

ఉహుద్ తరువాత హిజ్రీ 5వ సంవత్సరం అరేబియా తెగలన్నీ యూదులతో కలసి కుమ్మక్కయి మదీనాపైకి దాడి జరిపాయి. ఆ సమయాన మదీనా నగరం చుట్టూ కందకం త్రవ్వాలని సలహా వచ్చినప్పుడు అది త్రవ్వడంలోనూ, ఆ తరువాత పోరు సలపడంలోనూ మహనీయ తల్హా(ర) మున్ముందే ఉన్నారు. ఆ సందర్భాన్ని దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ప్రస్తావించడం జరిగింది.

**ఆ సమయాన మీరు చేస్తూ ఉన్నదంతా అల్లాహ్ చూస్తూనే ఉన్నాడు. అప్పుడు శత్రువులు మీ పైకి పైనుంచి క్రింది నుంచీ దండెత్తి వచ్చారు. భయం వల్ల మీ కళ్ళు బండ బారాయి. గుండెలు గొంతులోకి వచ్చేశాయి. మరి మీరేమో అల్లాహ్ గురించి విభిన్న రీతిలో సందేహించసాగారు. ఆ సందర్భంలో విశ్వసించిన వారు తీవ్రంగా పరీక్షించబడ్డారు, అతి తీవ్రంగా విదిలించి వేయబడ్డారు.**

***(అల్ అహ్జాబ్ 33: 10,11)***

అయితే ఆ సమయాన కూడా మహనీయ తల్హాతో సహా బలిష్టమయిన విశ్వాసం గలవారు ఆందోళన చెందుతున్న వర్గాల వద్దకు వెళ్ళి ఓదార్చుతూ దైవ మార్గంలో త్యాగనిరతి చూపవలసిందని ప్రోత్సహించారు. ఈ విషయాన్ని కూడా దివ్య ఖుర్‌ఆన్ పేర్కొంటుంది:

**ఆ సమయాన దాడి జరుపుతున్న సేనల్ని చూడగానే నిజ మయిన విశ్వాసులు ఎలుగెత్తి చాటారు, "అల్లాహ్ ఆయన సందేశహరుడు మాతో చేసిన వాగ్దానం ఇదే కదా! అల్లాహ్ ఆయన సందేశహరుని మాట నిజమయినదీ" అని.**

***(అల్ అహ్జాబ్ 33: 22)***

## అసలు రక్షణ

కొందరు కందకం వద్ద నిలబడి మాటలాడుకుంటూ ఉండగా మహనీయ తల్హా(ర) గమనించి అటుగా వెళ్ళారు. వారు తమ భార్యా పిల్లలను కాపాడుకునే ఏర్పాటు ఏదయినా చేసుకోవాలని అనుకుంటున్నారు. ఈ మాటలు విని ఆయన నిలబడి పోయారు. వారితో ఇలా అన్నారు, "దైవమే అత్యుత్తమ రక్షకుడు. మరెవరయితే తన శక్తి, ఉపాయాలను నమ్ముకుంటాడో అతను నిష్ఫలుడవుతాడు." ఈ మాట విని వారున్నూ "అవును, మీరన్నదే నిజం" అని పలికి తమ సంకల్పం మార్చుకున్నారు.

ఆయన బయ్త్ రిజ్వాన్‌లో, ఖైబర్ పోరులో, మూతా పోరులో పాల్గొన్నారు. మక్కా విజయానికి వెళ్ళే ప్రయాణంలో ప్రవక్తశ్రీ(స) తోపాటే మక్కాలో ప్రవేశించారు, మహనీయ ఉస్మాన్ బిన్ తల్హా నుంచి కాబా గృహం తాళంచెవి గ్రహించి ప్రవక్త మహనీయులకు తోడుగా కాబా గృహంలో ప్రవేశించారు. ఆ కీలక సమయంలో ప్రవక్తశ్రీ సాన్నిహిత్యం ఎంత సౌభాగ్యవంతమయినది!

హిజ్రీ 10వ సంవత్సరం ప్రవక్త మహనీయులు(స) హజ్జ్ కొరకు బయలుదేరినప్పుడు కూడా మహనీయ తల్హా ఆ పుణ్యప్రదమయిన బృందంలో ఉన్నారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఆ సమయాన ప్రవక్తశ్రీ(స), మరి మహనీయ తల్హా(ర) తప్ప మరెవరూ ఖుర్బానీ పశువు తీసుకురాలేదు.

ప్రవక్త మహనీయులు పరమపదించడం మహనీయ తల్హా(ర) కు భరింపరాని ఆఘాతం కలిగించింది. ఆయనకు జీవితం ఏ మాత్రం రుచించ లేదు. అప్పుడప్పుడు అనేవారు, "దైవం, బాధలన్నింటినీ భరించ వలసిందే అని ఆదేశించడం మూలాన ప్రవక్తశ్రీ(స) నేడు కంటికి దూరమయినా ఉత్తమ సహనం పాటించడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. దానితో పాటు దైవాన్నే ఆ సద్బుద్ధి కొరకు కూడా వేడుకుంటూ ఉంటాను."

★ ★ ★


వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

'చరితార్థులు'-2



# బేగం సుగ్రా ఖాతూన్

## (..... -1968)

83




జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల పట్ల ప్రత్యేక ఆసక్తి చూపటమే కాక లోతైన అధ్యయనంతో జ్ఞానపరంగా పరిణతి చెందిన మహిళలలో ఒకరు బేగం సుగ్రా ఖాతూన్. ఆనాడు నిజాం సంస్థానంలో భాగంగా ఉన్న ఉస్మానాబాద్‌లో సుగ్రా ఖాతూన్ జన్మించారు. ఆమె తల్లి సైదున్నిసా, తండ్రి సయ్యద్ హాదీ. పదమూడు సంవత్సరాల వయస్సులో జమిందారీ కుటుంబానికి చెందిన ముహమ్మద్ జమీర్‌తో ఆమెకు వివాహమయ్యింది. ఆ తరువాత ఆరు సంవత్సరాలకు ఆమె భర్తను కోల్పోయారు. అత్తింట తలెత్తిన ఆస్తి వివాదాల కారణంగా ఆమె ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోని మేనమామ ఇంట చేరారు. ఆ సమయంలో ఖిలాఫత్– సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. జాతీయోద్యమ వార్తలు ఆమెను నిలువనివ్వలేదు. ఆమెలోని దేశభక్తి భావనలు ఆమెను నిర్లిప్తంగా కూర్చోనివ్వలేదు, దాంతో ఆమె జాతీయోద్యమంలో ప్రవేశించారు. మహాత్ముని పిలుపు మేరకు విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో అత్యంత విలువైన తన వస్త్రాలను విసర్జించటమే కాక, విదేశీ వస్తు విక్రయశాలల ఎదుట పికెటింగ్ కార్యక్రమాలలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమాలలో సరోజినీ నాయుడు, మోతీలాల్ నెహ్రూలతో కలసి పాల్గొని పలుమార్లు పోలీసుల లాఠీ దెబ్బల రుచి చూశారు. ఆమె ఉద్యమ కార్యక్రమాలలో చురుకైన భాగస్వామ్యాన్ని అందించటం, నిరంతరం ఆ కార్యకలాపాలలో మునిగి తేలటం స్వజనులకు రుచించలేదు. ఎటువంటి తీవ్ర వ్యతిరేకత ఎదురైనా ఖద్దరు చుడీదార్–కుర్తాలను ధరించి ఉద్యమ కార్యక్రమాలలో స్వేచ్ఛగా పాల్గొన్నారు. ఖిలాఫత్ ఉద్యమ నిధుల కోసం ఆబాది బానో బేగం లక్నో పర్యటనకు రాగా 50 తులాల బంగారాన్ని, విలువైన వజ్రాలను జాతీయోద్యమ నిధికి విరాళంగా సమర్పించారు. ఆమె మంచి వక్త మాత్రమేకాక మంచి రచయిత్రి కూడా. ఆమె రాసిన రచనలు హందర్ద్, జమీందార్, హందం లాంటి సుప్రసిద్ధ ఉర్దూ పత్రికలలో చోటుచేసుకున్నాయి, ఆమె పలు నవలలు కూడా రాశారు.



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

క్విట్ ఇండియా ఉద్యమంలో సుగ్రా ఖాతూన్ చురుగ్గా పాల్గొన్నారు. కుటుంబ సమస్యల కారణంగా ఆమె పలుమార్లు హైదరాబాద్ పర్యట నలు జరపాల్సి రావటంతో, ఆ తరువాత జాతీయోద్యమంలో క్రియాశీలక పాత్ర నిర్వహించలేకపోయారు. భారత దేశ స్వతంత్ర భానుడు ఉదయించాక ప్రజాసేవలో నిరంతరం గడిపిన బేగం సుగ్రా ఖాతూన్ 1968 మే 10న తనువు చాలించారు.

❖ ❖ ❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది          ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు          మక్కా అవతరణ

# 46. అల్ అహ్ఖాఫ్

5–6 ఇంతకు అల్లాహ్‌ను కాదని ప్రళయం వరకూ తనకు సమాధానం ఇవ్వలేని వాటిని పిలిచే మనిషికన్నా అధికంగా దారి తప్పినవాడు మరెవడు కాగలడు, ఇంకా పిలిచేవారు తమను పిలుస్తున్నారన్న విషయం పట్ల కూడా ఏమీ ఎరుగనివారు వారు;[6] మరి మానవులందరూ సమావేశ పరచబడినప్పుడు వారు తమను పిలిచేవారికి శత్రువులుగా, వారి ఆరాధనను నిరాకరించేవారుగా తేలుతారు.[7]

6. అంటే, ఈ పిలిచేవారి పిలుపు అసలు వారి వద్దకు చేరనే చేరదు. వారు స్వయంగానూ తమ చెవులతో దాన్ని వినలేరు, లేదా తమను ప్రపంచంలో ఎవరో పిలుస్తున్నారన్న సమాచారం మరే మార్గం ద్వారానూ వారికి అందదు. ఈ దైవ వచనాన్ని సవివరంగా ఇలా అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలోని బహు దైవారాధకులు అందరూ దైవం తప్ప ఎవరినయితే ప్రార్థిస్తూ ఉంటారో వారు మూడు రకాలకు చెందినవారు. ఒకటి, నిర్జీవ మయిన, బుద్ధిశూన్యమయిన సృష్టిరాశులు. రెండు, గతించిన మానవ మహనీయులు. మూడు, తాము స్వయంగానూ మార్గభ్రష్టులయి ఇతరుల్నీ భ్రష్టులు చేసి ప్రపంచం నుండి నిష్క్రమించిన మార్గవిహీన ప్రజలు. మొదటి కోవకు చెందిన ఆరాధ్యులు తమ ఆరాధకుల ప్రార్థనలను గురించి వినక పోవడమన్నది తెలుస్తూనే ఉంది. పోతే రెండవ కోవకు చెందిన ఆరాధ్యులు, దైవానికి సన్నిహితులయిన మానవులు; వారు ప్రార్థనల ఎడల ఎరుగక పోవడానికి రెండు కారణాలు: ఒకటి, వారు అల్లాహ్ సన్నిధానంలో ఉన్న వ్యవస్థలో మానవ కంఠాలు నేరుగా వారివద్దకు చేరే అవకాశం లేదు. రెండు, అల్లాహ్, ఆయన దూతలు సయితం– మీరు జీవిత కాలమంతా ఎవరికి దైవాన్ని ప్రార్థించాలని బోధిస్తూ వచ్చారో వారిప్పుడు తిరిగి మిమ్మల్నే వేడుకుంటున్నారు అన్న సమాచారాన్ని అంద జేయరు. ఎందువల్లనంటే ఈ సమాచారం కన్నా అధికంగా బాధ కలిగించే విషయం వారికి మరొకటి కాజాలదు. ఇంకా అల్లాహ్ తన సదాచార దాసుల ఆత్మలకు బాధ కలిగించడం అసలే ఇష్టపడడు. ఇకపోతే, మూడవ కోవకు చెందిన ఆరాధ్యులు. వీరి వ్యవహారాన్ని పరిశీలిస్తే, వీరికి సమాచారం అందకపోవడానికి కూడా రెండే కారణాలు ముందుకు వస్తాయి. ఒకటి, వారు ఆరోపితుల స్థాయిలో దైవం వద్ద లాకప్‌లో ఉన్నారు. అక్కడ ప్రపంచంలోని ఏ ధ్వనీ వారి వద్దకు చేరదు. రెండు, అల్లాహ్, ఆయన దూతలు సయితం– మీరు ప్రపంచంలో నిర్వహించిన ఉద్యమం బాగా ఫలవంత మయింది, జనులు మీ తరువాత మిమ్మల్నే ఆరాధ్యులుగా చేసుకున్నారు అన్న సమాచారాన్ని వారికి అందజేయరు. ఎందుకంటే ఈ సమాచారం వారి సంతోషానికి మూలమవు తుంది, దైవం ఆ దుర్మార్గుల్ని ఎంతమాత్రం సంతోషపెట్టాలని కోరుకోడు.

ఈ సందర్భంలో మరో విషయాన్నీ అర్థం చేసుకోవాలి. పరమ ప్రభువు తన సజ్జనులయిన దాసులకు ప్రపంచ వాసుల సలాములు, వారు వీరి కొరకు దైవానికి చేసే కారుణ్య ప్రార్థనలు అందజేస్తాడు. ఈ విషయాలు వీరికి ఆనంద కారణమవుతాయి. అదే విధంగా అపరాధులకు ప్రపంచ ప్రజలు చేసే అభిశాప వచనాలు, ఛీత్కారాలు, తిట్లు తూల నాడులూ అందజేస్తాడు. ఉదాహరణకు, బద్ర్ యుద్ధంలో చంపబడిన తిరస్కారులకు, ఒక హదీసు ప్రకారం, ప్రవక్త మహనీయుల (స) అభిశాపం వినిపించబడింది. ఇది వారికి బాధ కలగజేస్తుంది గనక. కాని సత్పురుషులకు బాధ కలిగించే లేదా అపరాధులకు ఆనందం కలిగించే ఏ విషయమూ వారికి చేరవేయడం జరగదు. ఈ వివరణ వల్ల మృతులు వినే విషయానికి సంబంధించిన అంశం అతి స్పష్టంగా విశదమయిపోతుంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాం (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## 'హిజ్ర్' బస్తీ మీదుగా దైవప్రవక్త(స) సాగిపోవటం

**278)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) హిజ్ర్ ప్రదేశం నుండి సాగిపోతున్నప్పుడు ఇలా ఉద్బోధించారు: "తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న జనుల బస్తీ నుండి సాగిపోతున్నప్పుడు మీరు దుఃఖంతో విలపిస్తూ సాగిపోండి. ఎందుకంటే వారిపై వచ్చి పడిన ఆపద లాంటిది మీపైన కూడా రాకూడదు సుమా!" ఇలా చెప్పిన తరువాత ఆయన(స) తన తలపై దుప్పటి కప్పుకుని- ఆ ప్రదేశం దాటేవరకూ- చాలా వేగంగా అక్కడి నుండి ముందుకు సాగిపోయారు.[1]

**280)** తన తండ్రి ముగీరా బిన్ షూబా(రజి) తనతో చెప్పారని ఉర్వా బిన్ ముగీరా తెలియజేశారు: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవడానికి (దూరం) వెళ్ళారు. (ఆయన తిరిగి రాగానే) ఆయన (స) వుజూ చేసుకునేందుకుగాను నేను నీళ్ళు తీసుకుని వెళ్ళాను. ఈ సంఘటన తబూక్ యుద్ధ సందర్భంగా జరిగినట్టు ఆయన చెప్పినట్లుగా నాకు గుర్తు. దైవప్రవక్త(స) ఆ నీటితో ముఖం కడుక్కున్నారు. మోచేతుల సమేతంగా తన రెండు చేతుల్ని కడుక్కోవాలని ఆయన(స) సంకల్పించుకున్నప్పుడు, ఆయన చొక్కా చేతులు బిగుతుగా ఉన్నట్టు అనిపించాయి. అందువల్ల ఆయన తన చేతుల్ని చొక్కా క్రింది నుంచి బయటికి తీసి, కడుక్కున్నారు. పిదప తన మేజోళ్ళపై 'మసహ్' చేశారు.

**281)** అబూ హుమైద్ సాయిదీ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సఅసమ్)తో పాటు తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తుండగా, మదీనా నగరం సమీపించినప్పుడు (ఆయన-స మదీనా వైపు సంజ్ఞ చేస్తూ) "అదిగో అది తాబా. అదేమో ఉహుద్ పర్వతం. అది మమ్ము ప్రేమిస్తోంది. మేము దానిని ప్రేమిస్తు న్నాము" అని పలికారు.

**282)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తబూక్ నుండి తిరిగి వస్తూ, మదీనా నగరాన్ని సమీపించినప్పుడు ఇలా ప్రవచించారు: "మదీనాలో చాలామంది ఉన్నారు. మీరు ఎక్కడెక్కడ నడచినా, ఏ ఏ లోయలను మీరు దాటిపోయినా వారు (హృదయ పూర్వకంగా) మీతోపాటే ఉన్నారు." దానికి సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! వారు (మా వెంట రాకుండా) మదీనాలో ఉండి పోయినప్పటికీనా?' అని విన్నవించుకోగా, "అవును. వారు మదీనాలో ఉన్నప్పటికీ, మానసికంగా మీతోపాటే ఉన్నారు. ఎందుకంటే వారు ఒకానొక కారణంగా అక్కడ ఆగిపోవలసి వచ్చింది" అని దైవప్రవక్త(స) చెప్పారు.

278-1. దైవప్రవక్త మహనీయ సాలెహ్(అలైహిస్సలామ్) జాతి (సమూద్) జనులు నివసించిన బస్తీ పేరు 'హిజ్ర్' అని ఉల్లేఖ నాలలో ఉంది. తీవ్రమయిన భూకంపం, పిడుగుల ద్వారా ఆ జనావాసం ధ్వంసం చేయబడింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) తబూక్ యుద్ధ ప్రయాణ సందర్భంగా ఆ బస్తీ నుండి సాగిపోతున్నప్పుడు తన సహచరులను హెచ్చరించారు. ఈ ప్రదేశం సిరియా రాజ్యానికి- మదీనా నగరానికి మధ్యన ఉంది.




## హిజ్రత్‌కు ఏడేళ్ళ క్రితం-

మక్కాలో దైవప్రవక్త(సఅసం)పై, ఆయన ప్రియ సహచరులపై కాలపు కాళనాగులు బుసలు కొడుతున్న రోజులవి!

ఏ క్షణంలో ఏ కష్టాల కొండచరియ విరిగి పడుతుందోనని సత్యామృతాన్ని ఆస్వాదించిన దివ్యాత్మలు బిక్కుబిక్కుమంటూ బ్రతుకు వెళ్ళదీస్తున్న నికృష్ట ఘడియలవి!!

అలాంటి గడ్డు కాలంలో దైవప్రవక్త(సఅసం) పవిత్ర జీవితంలో ఓ సంతోష తరంగం ఎగిసిపడింది. ఉమ్మె ఐమన్‌కు అల్లాహ్ ఓ మగపిల్లవాడు ప్రసాదించాడన్న వార్తే ఈ సంతోషాతిశయానికి ప్రధాన కారణం. ఈ వార్త విన్నంతనే కారుణ్యమూర్తి (సఅసం) ముఖారవిందం మరింత ప్రకాశమానమయింది. మానవ మహోపకారి (సఅసం)కి అంతులేని ఆనందాన్ని కలిగించిన సౌభాగ్యవంతుడైన ఆ పసిపిల్లవాడు ఎవరో మీకు తెలుసా?

అతనే ఉసామా బిన్ జైద్ (రజి).

జైద్ బిన్ హారిసా, ఉమ్మె ఐమన్ దంపతులకు కలిగిన ముద్దు బిడ్డడు!

బానిసత్వ స్థితి నుంచి సేనాధిపతి స్థాయికి ఎదిగిన శూరుడు!!

కారుణ్యమూర్తి ముహమ్మద్ (సఅసం) గారి వాత్సల్యానికి, ప్రత్యేక అవ్యాజాను రాగాలకు నోచుకున్న అదృష్టవంతుడు!!!

పిన్న వయసులోనే వరిష్ట సహాబా పాల్గొన్న సేనావాహినికి నాయకత్వం వహించి, ఘన విజయం సాధించిన బహుముఖ ప్రజ్ఞాశాలి!!!!

ఉసామా పుట్టిన రోజు కారుణ్యమూర్తి (సఅసం)కి కలిగిన అమితమైన సంతోషానికి ప్రియ సహచరులు ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఆ పసివాని తల్లిదండ్రులతో దైవప్రవక్త(స)కు గల సాన్నిహిత్యం గురించి వారందరికీ తెలుసు. ఉసామా తల్లి అసలు పేరు బర్కత్. ఇథియోపియా దేశానికి చెందిన ఈ నల్లని నీగ్రో మహిళా బానిస ఉమ్మె ఐమన్‌గా ప్రసిద్ధి చెందింది. దైవప్రవక్త(సఅసం) కన్నతల్లి వద్ద సేవకురాలిగా పనిచేసిన అదృష్టం కూడా ఆమెకు వరించింది. ప్రవక్త మాతృశ్రీ పరమపదించిన మీదట ఆయన్ని(స) ఎత్తుకుని ముద్దాడిన, సాకిన సౌభాగ్యం కూడా ఆ మహా తల్లికే దక్కింది. అందుకే, "ఉమ్మె ఐమన్ నా తల్లిలాంటిది. నా పరివార సభ్యురాలు" అని మహాప్రవక్త(స) తరచూ అంటూ ఉండేవారు.

ఇదీ ఉసామా బిన్ జైద్(రజి) గారి మాతృశ్రీ సంక్షిప్త పరిచయం. ఇక ఈయన తండ్రి గారైన జైద్ బిన్ హారిసా (రజి)

గురించి ఏమని చెప్పేది!? ఆయన దైవప్రవక్త(స)కు ప్రియతముడు. ఖుర్‌ఆన్ అవతరణకు పూర్వం ఆయన(స) జైద్‌ను తన పెంపుడు కొడుకుగా ప్రకటించారు. ఇంట్లో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా దైవప్రవక్త(స)ను వెన్నంటి ఉండే అదృష్టం జైద్ బిన్ హారిసా (రజి)కు లభించింది. దైవప్రవక్త ఆంతరంగికుడన్న బిరుదు కూడా ఆయనకు ప్రాప్తమయింది.

ఉసామా బిన్ జైద్ జన్మించినప్పుడు ప్రవక్త ప్రియ శిష్యులకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. ఎందుకంటే దైవ ప్రవక్త(స) సంతోషానికి కారణమైన ప్రతి ఒక్కరినీ వారు ప్రత్యేకంగా అభిమానించేవారు.

ప్రవక్త ప్రియ సహచరులు ఉసామాకు 'ప్రవక్త ప్రియతముడు' అనే బిరుదు ఇచ్చారు. ఈ చంటి పిల్లాడికి ఈ బిరుదును ఇవ్వటంలో సహాబా ఏమాత్రం అతిశయానికి పోలేదు. ఎందుకంటే దైవప్రవక్త(సఅసం)కు ఆ అబ్బాయిపై గల వాత్సల్యం అటువంటిది. ఆ చిన్నారి బాలునిపై మానవ మహోపకారి (స) కురిపించే అవ్యాజానురాగాలను చూసి చాలామంది ఈర్ష్యానందం (రష్క్) చెందేవారు.

దైవప్రవక్త(సఅసం) తన ముద్దుల మనవడైన హసన్ (రజి)ని ఎంతగా ప్రేమించేవారో, ఉసామా (రజి)ను కూడా అంతగానే ప్రేమించేవారు. హసన్ తన తాతగారి మాదిరిగా చాలా అందంగా ఉండేవారు. కాని ఉసామా మాత్రం తన మాతృశ్రీ ఉమ్మె ఐమన్ మాదిరిగా నల్ల నేరేడులా ఉండేవారు. అయితే దైవప్రవక్త (సఅసం) ఆ అబ్బాయిలిద్దరినీ సమానంగా ప్రేమించేవారు. ఉసామా (రజి)ను ఒక తొడపై, హసన్(రజి)ను ఒక తొడపై కూర్చోబెట్టుకునేవారు. ఒక్కోసారి వారిద్దరినీ తన హృదయానికి హత్తుకునేవారు. వారిద్దరి కోసం ఇలా ప్రార్థించేవారు-

''దేవా! నేను ఈ బాలురిద్దరినీ ప్రేమిస్తున్నాను. నీవు కూడా వీరిని నీ ప్రియతములుగా చేసుకో.''

ఒకసారి ఉసామా (రజి) గుమ్మం వద్ద కాలు జారిపడ్డారు. ఆ అబ్బాయి నుదురు చిట్లి రక్తం స్రవించింది. ఆ రక్తాన్ని తుడవమని దైవప్రవక్త తన ధర్మపత్ని ఆయిషా(ర.అ)కు సంజ్ఞ చేశారు. కాని హజ్రత్ ఆయిషా(ర.అ) మరేదో పనిలో నిమగ్నమై ఉండటం వల్ల తక్షణం ఆ పని చేయలేకపోయారు. అందువల్ల దైవప్రవక్త (సఅసం) తన స్వహస్తాలతో ఆ రక్తాన్ని తుడిచారు.

ప్రియ ప్రవక్త పసితనంలో ఉసామా (రజి)ను ఎంతగా ప్రేమించేవారో టీనేజీలో కూడా ఆ కుర్రవాణ్ణి అంతగానే లాలించారు.

ఒకనాటి సంఘటన-

హకీమ్ బిన్ హిజామ్ అనే ఖురైషు సర్దార్ విలువైన ఒక జత దుస్తుల్ని దైవప్రవక్త(స)కు కానుకగా సమర్పించుకున్నాడు. యమన్‌లో అతను 50 దీనార్లు పెట్టి కొనుగోలు చేసిన ఖరీదైన దుస్తులవి. సాధారణంగా అటువంటి దుస్తుల్ని యమన్ రాజు కోసం తయారు చేసేవారు. దైవప్రవక్త(స) ఆ కానుకను స్వీకరించలేదు. ఎందుకంటే అప్పటికి హకీమ్ బిన్ హిజామ్ ఇంకా బహు దైవారాధకుడిగానే ఉన్నారు. అయితే మహాప్రవక్త(స) ఆ దుస్తుల్ని హకీమ్ బిన్ హిజామ్ వద్ద కొనుక్కున్నారు. ఖరీదైన ఆ దుస్తుల్ని ఆయన(స) ఒక్కసారి మాత్రమే- శుక్రవారం నాడు- ధరించి, ఉసామా బిన్ జైద్ (రజి)కి ప్రదానం చేశారు. ఆ క్షణంలో ఉసామా బిన్ జైద్ (రజి) పరమానందభరితులయ్యారు. తాను ఉదయం సాయంత్రం ఆ దుస్తుల్ని తొడిగి అన్సార్ ముహాజిర్ సహాబా మధ్యన రాకపోకలు సాగించేవారు.

★ ★ ★

ఉసామా బిన్ జైద్ (రజి) యుక్త వయస్సుకి చేరుకునే సరికి సద్గుణ సంపన్నుడుగా కూడా గుర్తింపు పొందారు. అదీగాక ఆయన బుద్ధికుశలతలో సాటిలేని మేటి. దానికితోడు వివేకవంతుడు, శూరుడు, మృదు మనస్కుడు, సాత్వికుడూను. తన సద్గుణాల కారణంగా జన బాహుళ్యంలో ఆయన అందరి తల్లో నాలుకగా ఉండేవారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా ఉసామా తన సమ వయస్కులైన కుర్రాళ్ళతో కలసి కదన రంగం వైపునకు కదలి వచ్చారు. వారిలో కొంతమంది యుద్ధం చేయడానికి ఎంపికయ్యారు. మరికొంతమంది ఆ రిక్రూట్‌మెంట్‌లో పిన్న వయసు కారణంగా సెలెక్ట్ కాలేకపోయారు. సెలెక్ట్ కాలేకపోయిన వారిలో ఉసామా బిన్ జైద్ (రజి) కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) సారథ్యంలో దైవమార్గంలో పోరాడే అదృష్టానికి నోచుకోలేకపోయినందుకు ఎంతో బాధపడ్డారీ యువ కిశోరం. ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దారంతా అదే పనిగా ఏడుస్తూ వచ్చారు.

★ ★ ★

కందక పోరాటం (అహ్జాబ్ యుద్ధం) సందర్భంగా కూడా ఉసామా బిన్ జైద్(రజి) తోటి కుర్రవాళ్ళతో కలసి యుద్ధ రంగానికి వచ్చారు. ఈసారి కూడా పిన్న వయసు కారణంగా ఎక్కడ సెలెక్ట్ కాలేనోనన్న సంశయంతో, తన కాలివ్రేళ్ళపై

నిలబడి తాను ఎంతో ఎత్తుకు ఎదిగానని నిరూపించుకునేం దుకు యత్నించారు. ఉసామాలోని ఈ ఉత్సాహాన్ని చూసి దైవ ప్రవక్త(స) సంతోషించారు. ఆ రిక్రూట్‌మెంట్‌లో ఉసామాను కూడా సెలెక్ట్ చేశారు. ఆ విధంగా దైవమార్గంలో కరవాలం చేబూనే నాటికి ఉసామాకు పదిహేను ఏండ్లే.

★★★

హునైన్ యుద్ధంలో ముస్లింలు మొదట పరాజయాన్ని చవిచూసిన క్లిష్ట సమయంలో ఆరుగురు సహాబా మాత్రమే కదన రంగంలో స్థిరంగా నిలబడి ఉన్నారు. వారిలో ఒకరు ఉసామా బిన్ జైద్(రజి). ఈ ఆరుగురు శూరుల మూలంగానే దైవప్రవక్త(సఅసం) పరాజయాన్ని కాస్తా విజయంగా మార్చే శారు. మడమ త్రిప్పి పారిపోతున్న ముస్లింలు దైవప్రవక్త(స) పిలుపుపై తిరిగి వచ్చారు.

★★★

మూతా యుద్ధంలో హజ్రత్ ఉసామా తన తండ్రి జైద్ బిన్ హారిసా నేతృత్వంలో పాల్గొన్నారు. అప్పటికి ఆయన వయసు 18 సంవత్సరాలు. తన కళ్ళ ఎదుటే కన్న తండ్రి వీర మరణం పొందిన దృశ్యాన్ని చూశారు. అంతేకాదు, హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ వంటి శూరులు ఒకరి తరువాత ఒకరు అమరగతి నొందటం కూడా ఈయన కళ్ళ ముందరే జరిగింది. ఆ తరువాత హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ముస్లిం సేనలకు నాయకత్వం వహించి, అత్యంత చాకచక్యంగా ఘోర పరాజయం నుండి కాపాడు కున్నారు.

★★★

ఉసామా బిన్ జైద్ (రజి) గుండె దిటవు చేసుకుని, అమరగతి నొందిన తన తండ్రి భౌతిక కాయాన్ని, సిరియా గడ్డలో- దైవా నికి అప్పగించి, తండ్రి స్వారీ అయ్యే గుర్రంపై మదీనా చేరు కున్నారు.

★★★

హిజ్రీ 11వ సంవత్సరం-

రోమనులతో యుద్ధం చేయడానికి సైనిక సన్నాహాలు చేయ మని దైవప్రవక్త(స) ఉత్తర్వు జారీ చేశారు. ఆ సైన్యంలో మహనీయ అబూబక్ర్, ఉమర్, సాద్ బిన్ అబీ వక్కాస్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజిఅన్‌హుమ్) వంటి అగ్రశ్రేణి సహాబా ఉన్నారు. కాని ఆ సేనా వాహినికి కమాండరన్ ఛీఫ్‌గా ఉసామా బిన్ జైద్(రజి)ను నియమించారు ప్రవక్త మహ నీయులు(స). అప్పటికి ఆ యువ కిశోరానికి 20 ఏళ్ళు కూడా నిండలేదు. ఈ సైనిక పటాలం మదీనా పొలిమేరల్లో ఉండగానే దైవప్రవక్త(సఅసం) అస్వస్థతకు గురయ్యారు.

హజ్రత్ ఉసామా (రజి) ఇలా అంటున్నారు :

"ప్రవక్త మహనీయులు (సఅసం) తీవ్ర అనారోగ్యానికి గుర్రై ఉన్నారని తెలుసుకుని నేను కొంతమంది సహచరులతో కలసి పరిచర్యలు చేసేందుకు ఆయన (స) సన్నిధిలో హాజరయ్యాను. దైవప్రవక్త(స) మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. పదేపదే తన చేతిని ఎత్తి నాపైన పెట్టసాగారు. ఆయన(స) నన్ను ఆశీర్వదిస్తున్నారని నాకు అర్థమైపోయింది."

★★★

కాసేపటికే కారుణ్యమూర్తి (సఅసం) తన మహోన్నత మిత్రుని వద్దకు మహా ప్రస్థానం చేశారు. హజ్రత్ అబూ బక్ర్ (రజి) ఖలీఫాగా ఎన్నుకోబడ్డారు. సహాబా అంతా అబూబక్ర్ (రజి) చేతిలో చెయ్యేసి సహకార ప్రతిజ్ఞ చేయసాగారు. ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మహనీయ అబూ బక్ర్ (రజి) చేసిన మొట్టమొదటి పని ఉసామా బిన్ జైద్ (రజి)నేతృత్వంలో సైనిక పటాలాన్ని రోము సామ్రాజ్యం వైపు నకు పంపటం. ఈ విధంగా దైవప్రవక్త(సఅసం) గైకొన్న నిర్ణయానికి కార్యరూపం ఇచ్చే ప్రయత్నం చేశారు ప్రథమ ఖలీఫా. కాని ఈ వ్యవహారంలో అన్సార్ సహాబా ఆలోచన మరో విధంగా ఉంది. ఈ సైన్యాన్ని పంపటంలో తొందర పడకూడదన్నది వారి అభిప్రాయం. తమ అభిప్రాయాన్ని ఖలీఫాకు తెలియపరచడానికి వారు హజ్రత్ ఉమర్(రజి)ను ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఒకవేళ సైన్యాన్ని పంపటం అంతగా అవసరం అనుకుంటే, ఉసామా లాంటి కుర్రవాణ్ని సైన్యాధిపతిగా ఉంచే బదులు వరిష్ఠ సహాబీని సైన్యాధిపతిగా నియమించమని కూడా వారు కోరారు. హజ్రత్ ఉమర్ (రజి) నోట అన్సార్ల ప్రతిపాదన విని మహనీయ అబూబక్ర్ (రజి) ఆగ్రహోదగ్రులయ్యారు. ఆయన(రజి) ఏమన్నారో చూడండి-

"ఓ ఖత్తాబ్ పుత్రుడా! ఇది కడు శోచనీయం. దైవ ప్రవక్త(సఅసం) స్వయంగా ఉసామా (రజి)ను సైన్యాధిపతిగా నియమించగా అతనిని ఆ పదవి నుండి తొలగించమని మీరు నాకు సలహా ఇస్తారా? దైవసాక్షి! ఇది అసంభవం."

ఖలీఫా దగ్గరి నుండి తిరిగి వచ్చిన ఉమర్(రజి) ఏమంటారో వినడానికి సైనికులంతా ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఆయన వచ్చీరాగానే "మీ మూలంగా ఈ రోజు నేను దైవ ప్రవక్త(సఅసం) ఖలీఫా మనసు నొప్పించాను. మారు మాట్లాడ

కుండా మీరంతా కర్తవ్య నిర్వహణకై బయలుదేరండి'' అన్నారు.

★★★

ఇస్లామీయ సైన్యం బయలుదేరడానికి సిద్ధమయింది. దైవ ప్రవక్త ప్రాణమిత్రులు, ప్రథమ ఖలీఫా అయిన అబూబక్ర్ (రజి) వీడ్కోలు పలకడానికి వచ్చారు. సైన్యాధిపతి ఉసామా బిన్ జైద్(రజి) గుర్రంపై స్వారీ అయి వుండగా ఖలీఫా మహనీయ అబూబక్ర్ (రజి) కొంత దూరం నడచి వచ్చారు.

''అమీరుల్ మోమినీన్! దైవసాక్షి. తమరు గుర్రమెక్కి రండి, లేదంటే నన్నయినా గుర్రం మీది నుండి దిగి మీ వెంట నడచి రానివ్వండి'' అని ఉసామా (రజి) అంటే,

''దైవం తోడు! నీవు గుర్రం దిగవలసిన అవసరమూ లేదు. నేను గుర్రంపై స్వారీ అవవలసిన పనీ లేదు'' అని ఖలీఫా సమాధానమిచ్చారు.

''కొన్ని క్షణాలు దైవమార్గంలో నా పాదాలకు ధూళి తగిలే అవకాశమన్నా నాకు కల్పించండి'' అని కూడా అన్నారు.

ఉసామా (రజి)ను దీవించి, కదన రంగానికి పంపిస్తూ, ''దైవప్రవక్త (సఅసం) నీకు చేసిన వసీయత్‌కు కట్టుబడి ఉండు'' అన్నారు.

తరువాత నెమ్మదిగా ఉసామా (రజి) చెవిలో, ''ఉమర్‌ను గనక నా సహాయార్థం ఇక్కడే వదలి వెళితే కృతజ్ఞుడనై ఉంటాన''ని అన్నారు ఖలీఫా.

హజ్రత్ ఉసామా (రజి) ఈ ప్రతిపాదనతో ఏకీభవించారు.

★★★

ఉసామా బిన్ జైద్(రజి) సైన్యాన్ని తీసుకుని బయలుదేరారు. ఈ సందర్భంగా దైవప్రవక్త (సఅసం) చేసిన సూచనలన్నింటినీ తు.చ తప్పకుండా పాటించారు. మొదటి దశలో ముస్లిం సేనలు బల్ఖా, దారె రూమ్ కోటల్ని కైవసం చేసుకున్నాయి. ఈ విజయంతో ముస్లిం సైనికుల్లో రోము మహా సామ్రాజ్యం పట్ల గల భయం దూరమయింది.

దయారె షామ్, ఈజిప్టు, ఉత్తర ఆఫ్రికాను కూడా జయించి నల్ల సముద్రం వరకూ ఇస్లామీయ రాజ్య పతాకాన్ని ఎగురవేశారు. హజ్రత్ ఉసామా (రజి) ఈ జైత్ర యాత్రను పూర్తి చేసుకుని, తన తండ్రి గారి అశ్వంపై స్వారీ అయి విజేతగా మదీనాకు తిరిగి వచ్చారు. భారీ ఎత్తున యుద్ధ ప్రాప్తిని కూడా తీసుకువచ్చారు. హజ్రత్ ఉసామా (రజి) నేతృత్వంలోని సైనిక పటాలం తీసుకొచ్చినంత విజయ ధనం అంతకు ముందెన్నడూ ఎవరూ తీసుకురాలేదన్న విషయం కూడా నలువైపులా ప్రాకిపోయింది.

★★★

ఒక్కో దినం, ఒక్కో నెల గడుస్తున్న కొద్దీ ముస్లింల హృద యాలలో ఉసామా పట్ల ఆదరాభిమానాలు పెరగసాగాయి. దైవప్రవక్త(స) యెడల గల విశ్వాస పాత్రత, సేవానిరతి కార ణంగానే ఉసామాకు ఈ కీర్తి ప్రతిష్ఠలు ప్రాప్తమయ్యాయన్నది నిర్వివాదాంశం.

ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో ముస్లిం యోధులకు పెన్షన్లు నిర్ధారిస్తున్నప్పుడు, తన కన్న కొడుకు కన్నా ఎక్కువ పెన్షన్‌ను ఉసామా (రజి) కొరకు నిర్ధారించారు.

''నాన్న గారూ! అదేమిటి, మీరు ఉసామా (రజి)కు నాలుగు వేల దిర్హములు పెన్షన్‌ను నిర్ధారించి, నాకేమో మూడు వేలే నిర్ధారించారు? చూడబోతే మీకున్న అంతస్తు అతని నాన్నకు దక్కలేదు. నాకు ప్రాప్తమై ఉన్న అంతస్తు ఉసామా(రజి)కు ప్రాప్తమవలేదు కదా!'' అని కొడుకు ఫిర్యాదు చేసినప్పుడు, ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) ఏమన్నారో తెలుసా!

''ఒరేయ్ అబ్బాయి! నీ ధోరణి కడు శోచనీయం. నీకు తెలీక పోతే విను. అతని తండ్రి నీ తండ్రి కన్నా ఎక్కువగా దైవ ప్రవక్త(స)కు ప్రేమపాత్రుడు. మరి ఉసామా (రజి) అంటావా, అతను సయితం నీకన్నా అధికంగానే ప్రవక్త(స)కు ప్రియతముడు''.

ఈ సమాధానం విని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) మారు మాట్లాడకుండా తండ్రి ఖలీఫా నిర్ణయాన్ని శిరసా వహించారు. హజ్రత్ ఉమర్(రజి) ఈ బానిస పుత్రుణ్ణి ఎప్పుడు చూసినా, ''స్వాగతం, నా సర్దారు విచ్చేశాడు'' అంటూ సంతోషాన్ని వెలిబుచ్చేవారు. ఖలీఫా వైఖరిపై ఎవరయినా ఆశ్చర్యం చెందితే, వారిని సమాధానపరుస్తూ ఉమర్(రజి) ఇలా అనేవారు. ''మీకు తెలీదేమో! ఒకానొక సమయంలో దైవప్రవక్త(సఅసం) ఉసామాను నాపైన సైన్యాధిపతిగా నియమించారు.''

★★★

ఈ శుభాత్ములపై అల్లాహ్ తన కారుణ్య జల్లును కురిపించుగాక! నిశ్చయంగా ప్రవక్త ప్రియ సహచరుల దైనందిన చర్యల్లో మానవత్వం పరిమళించేది. వారు మాన వత్వపు అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారు. అటువంటి శుభాత్ములను చరిత్ర మరెన్నడూ కనీవినీ ఎరుగదు. ✤

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



డా. ఎన్.కలీల్

**జూన్ 12న** ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 దేశాలు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ 2002లో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని స్థాపించింది. పిల్లలు పెరిగే, మంచి వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని, అలాగే ప్రపంచ వ్యాప్తంగా బాల కార్మిక సమస్య నివారణను ఈ రోజు నొక్కి చెబుతుంది. పరిశోధన ప్రకారం, ప్రపంచంలోని ప్రతి పది మంది యువకులలో దాదాపు ఒకరు బలవంతంగా శ్రమలోకి నెట్టబడుతున్నారు. 2000 నుండి ఈ సంఖ్య తగ్గింది, కాని ఇటీవలి సంవత్సరాలలో తగ్గుదల రేటు తగ్గింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 152 మిలియన్ల మంది బాల కార్మికులు పనిచేస్తున్నారు, వారిలో 72 మిలియన్ల మంది ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్నారు.

అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం, బాల కార్మిక సమస్య అంటే "పిల్లల యవ్వనాన్ని, సామర్థ్యాన్ని, గౌరవాన్ని కోల్పోయే ఉద్యోగం. ఇది వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది." పిల్లలకు విద్య, మంచి జీవితాన్ని పొందే హక్కును నిరాకరించే ఉద్యోగం. బాల కార్మిక సమస్య అంటే పిల్లలపై శారీరక, భావోద్వేగ లేదా సామాజిక ప్రభావాలను చూపే, వారికి ఏదో ఒక విధంగా హాని కలిగించే ఏదైనా ఉద్యోగం. వాస్తవానికి, పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా నిరోధించే ఏ రకమైన ఉద్యోగమైనా బాల కార్మికులుగా పరిగణించబడుతుంది. ఈ సమస్యకు ప్రధాన కారణాలలో పేదరికం ఒకటి, ఎందుకంటే పిల్లలు తమ తల్లిదండ్రుల కుటుంబాలను నిలబెట్టుకోవడానికి బడి మానేసి తక్కువ వేతన వృత్తులలో పనిచేయవలసి వస్తుంది. ఇంకా, వ్యవస్థీకృత నేరముఠాలు కొంతమంది పిల్లలను బాల కార్మికులుగా నెట్టివేస్తాయి. ఐక్యరాజ్య సమితి ప్రకారం, 5 నుండి 17 సంవత్సరాల వయస్సు గల దాదాపు 152 మిలియన్ల మంది పిల్లలు బాల కార్మికులుగా పని చేస్తున్నారు. వారిలో సగం కంటే ఎక్కువ మంది లేదా 73 మిలియన్ల మంది ప్రమాదకరమైన పనుల్లో ఉన్నారు. బాల కార్మికుల బాధితుల్లో దాదాపు 48% మంది 5 నుండి 11 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు, 28% మంది 12 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు, 24% మంది 15 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు.

## ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం చరిత్ర

1919లో అంతర్జాతీయ కార్మిక సంస్థ సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం, అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను స్థాపించడం లక్ష్యంగా స్థాపించబడింది. ILOలో 137 దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

అప్పటి నుండి, ప్రపంచవ్యాప్తంగా కార్మిక పరిస్థితులను మెరుగుపరచడం లక్ష్యంగా ILO అదనపు ఒప్పందాలను అమలు చేసింది.

1973లో, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) పని చేయడానికి కనీస వయస్సుపై దృష్టి సారించిన కన్వెన్షన్ నంబర్ 138ని అమలు చేసింది. సభ్య దేశాలు కనీస ఉపాధి వయస్సును పెంచడం, బాల కార్మిక సమస్యను నిర్మూలించడం దీని లక్ష్యం.

2002లో, ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా కార్మిక సమాజాన్ని పర్యవేక్షించే ఐక్యరాజ్యసమితి సంస్థ అయిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) స్థాపించింది. 5 నుండి 17సంవత్సరాల వయస్సు గల చాలా మంది పిల్లలకు సరైన పాఠశాల విద్య, వైద్య సేవలు, విశ్రాంతి సమయం లేదా ప్రాథమిక స్వేచ్ఛలను అందించడం ద్వారా వారు సాధారణ బాల్యాన్ని కలిగి ఉండేలా ఇది నిర్ధారిస్తుంది.

## 2025 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం థీమ్

2025 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం థీమ్ ఇంకా ప్రకటించబడలేదు. ఈ సంవత్సరం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం బాల కార్మిక శక్తిపై అత్యవసర పరిస్థితుల ప్రభావంపై దృష్టి పెడుతుంది. కోవిడ్-19 మహమ్మారి, తత్ఫలితంగా ఆర్థిక, ఉపాధి సంక్షోభం వ్యక్తుల జీవితాలను, ఉద్యోగాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. 2002లో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని స్థాపించారు, ఇది ప్రపంచవ్యాప్త కార్మిక సమాజాన్ని పర్యవేక్షించే ఐక్యరాజ్యసమితి సంస్థ అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO). ఇది 5 నుండి 17 సంవత్సరాల వయస్సు గల చాలా మంది పిల్లలకు సరైన పాఠశాల విద్య, వైద్య సేవలు, విశ్రాంతి సమయం లేదా ప్రాథమిక స్వేచ్ఛలను అందించడం ద్వారా వారికి సాధారణ బాల్యాన్ని కలిగి ఉండేలా చేస్తుంది.

## 2025 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రాముఖ్యత

ప్రపంచవ్యాప్తంగా బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అనేది బాల కార్మిక సమస్య గురించి అవగాహన పెంచడానికి, దానిని నిర్మూలించడానికి పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి గుర్తించబడింది. ప్రపంచవ్యాప్తంగా బాల కార్మిక శక్తిలోకి బలవంతంగా పంపబడే పిల్లలు ఎదుర్కొనే భయంకరమైన భావోద్వేగ, శారీరక పరిణామాల గురించి అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రధానంగా పిల్లల అభివృద్ధిపై దృష్టి సారించి, పిల్లల విద్య, గౌరవప్రదమైన ఉనికి హక్కులకు మద్దతు ఇస్తుంది. 2030 నాటికి ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను (SDGs) సాధించడం చాలా కీలకం. ILO వంటి అనేక సంస్థలు బాల కార్మికులను తగ్గించడానికి కృషి చేస్తున్నాయి. కానీ మనం కూడా జవాబుదారీగా ఉండాలి. ఈ సమస్యను నిర్మూలించడంలో సహాయం చేయడానికి బాధ్యతను అంగీకరించాలి.

సమాజం మొత్తం కలిసి ఈ సమస్యను ఎదుర్కోవాలి. దీని కొరకు ప్రతి ఒక్కరు ఒక బాధ్యతతో ముందుకు రావాలి. పుస్తకం పట్టే చేతిని పనివేళ్ళుగా మార్చకూడదు. మన చిన్నారులు మన దేశ భవిష్యత్తు. వారికి చదువుని, హక్కులను ఇవ్వాలి. వారి కలలకి రెక్కలివ్వాలి.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# మక్కా మహీతలం మీద మహనీయ ముహమ్మద్(స) మహితోక్తులు



**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

### దయలేని వారు దయా దాక్షిణ్యాలకు నోచుకోరు

సర్వవిధముల స్తోత్రములు సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్‌కు మాత్రమే చెందుతాయి. మేము ఆయన్నే కీర్తిస్తున్నాము. ఆయన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కొరకు ఆ ఆపద్బాంధవుడినే అర్థిస్తున్నాము.

“ప్రజలారా! నేను మీకు ప్రేమాభిమానాలు మమతానురాగాలు, అనుబంధం ఆత్మీయతల గురించి హితవు చేస్తున్నాను. ఓ మంచి మాటను మీతో చెప్పగోరుతున్నాను. శ్రద్ధగా ఆలకించండి! నా ప్రభువు ఇలా అంటున్నాడు: నాకు కరుణ, దయ, జాలి అంటే ఎంతో ఇష్టం. దయ, జాలి లేని వ్యక్తి నా కటాక్షాలకి దూరంగా ఉంటాడు”. దైవ కారుణ్యానికి దూరమవటం ఎంతటి దౌర్భాగ్యమో మీరు గ్రహించారా? ఇది ఎలాంటి దుష్పరిణామానికి దారి తీస్తుందో ఆలోచించారా!?

“దైవ దాసులారా! నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. దయలేని వ్యక్తి మీద దయజూపడం జరగదు. ఎప్పటివరకైతే మీరు దైవ సృష్టితాల పట్ల దయ కలిగి వుండరో అప్పటి వరకు దేవుని కరుణ మిమ్మల్ని తన బాహువుల్లో సేదతీరేందుకు చోటివ్వదు. ప్రతి నిమిషం, ప్రతి ఘడియ మీకు దైవ కరుణ అవసరం ఉంది. ఆ దయా సాగరుడు సాటి ప్రజల పట్ల దయ కలిగి ఉండమని హితవు చేస్తున్నాడు. అలా గనక మీరు చేస్తే దైవ కారుణ్య కడలి మీ కొరకు ఉప్పొంగుతుంది. బీటలు వారిన మీ మనోభూమి పచ్చని గుణాలతో కళకళ్ళాడుతుంది. మీ జీవితాలు కష్టాల మండు వేసవిలో సుఖశాంతుల నిండు వసంతంగా మార్చివేయబడతాయి.

“ఏ శక్తి స్వరూపుని అధీనంలోనైతే నా ప్రాణం ఉందో ఆ సర్వోన్నతుని సాక్షి! స్వర్గమనే అనంత సౌఖ్యాల నిలయంలో కరుణ గలవారు తప్ప ఇతరులు కాలు మోపలేరు. రేపు తీర్పు దినాన

ఆ సత్య స్వరూపుడు తన సృష్టిరాసుల పట్ల కఠినంగా ప్రవర్తించినవారిని, బాధించిన వారిని, ఇక్కట్లకు గురిచేసి వారి జీవితాలను వీధిపాలు చేసినవారిని కఠినంగా శిక్షిస్తాడు. నా ప్రభువు చేసిన ప్రమాణం ఏమిటంటే? ''నా దయను కోరుకొనే వారు నా దాసులపట్ల దయ కలిగి ఉండాలి''. నేను మీకు చెబుతున్నది ఏమిటంటే ''సౌలభ్యాన్ని కలుగజేయండి. ప్రజలను కాఠిన్యానికి గురి చేయకండి. శుభవార్తలు అందజేయండి. ద్వేషం, అసహ్యం కలిగించే మాటలు చెప్పకండి''. (బుఖారీ, ముస్లిం)

బాగా గుర్తుంచుకోండి! దేవుడు మృదు స్వభావి. ఆయన మృదుత్వాన్ని ఇష్టపడుతాడు. కాఠిన్యం వల్లగాని, మరే ఇతర విషయం వల్లగాని ప్రసాదించనిది అల్లాహ్ మృదుత్వం మూలంగా ప్రసాదిస్తాడు. (ముస్లిం)

దైవ దాసులారా! మీతో మరో మాట కూడా చెప్పాల్సి ఉంది. ఒకరికి మేలు చేయడం అనేది పూర్తిగా కరుణకు సంబంధించిన విషయమే. కఠిన మనస్సు మూలంగా ఏ ప్రాణికీ మేలు చేకూరదు. జాలి గుండె గల వ్యక్తితోనే మంచిని ఆశించగలం. మేలు చేయడం జాలి స్వభావానికి అతి పెద్ద నిదర్శనం అని తెలుసుకోండి. కొన్ని విషయాలు ఇక్కడ ఉదాహరిస్తున్నాను: వికలాంగులు, వ్యాధిగ్రస్తుల పట్ల దయ చూపడం అంటే అతను పూర్తిగా కోలుకొని పూర్వ స్థితికి చేరుకొనేంతవరకు అవసరమైన వైద్య సదుపాయాలను సమకూర్చి పెట్టి, అతనికి కావాల్సిన తిండి బట్టలను అందించాలి. ఒక ముస్లిం తోటి ముస్లిమును ఉదయం పూట పరామర్శిస్తే, డెబ్బై వేల మంది దైవ దూతలు సాయంత్రం వరకూ అతని శ్రేయస్సు కోసం దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటారు. అదే సాయంత్రం వేళ పరామర్శిస్తే, ఉదయం వరకూ దైవ దూతలు అతని యోగక్షేమాల కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అతని కోసం స్వర్గ ఫలాలు ఏరి కూరి ఉంచబడతాయి (తిర్మిజీ). ఒక ముస్లిం తన సోదర ముస్లిమును పరామర్శించడానికి వెళ్ళి తిరిగి వచ్చేంతవరకు స్వర్గపు తాజా పండ్లు ఏరుతూ ఉంటాడు.

(ముస్లిం)

**బాగా గుర్తుంచుకోండి! దేవుడు మృదు స్వభావి. ఆయన మృదుత్వాన్ని ఇష్టపడుతాడు. కాఠిన్యం వల్లగాని, మరే ఇతర విషయం వల్లగాని ప్రసాదించనిది అల్లాహ్ మృదుత్వం మూలంగా ప్రసాదిస్తాడు. (ముస్లిం)**

''అలాగే ఎవరికైనా కష్టకాలం దాపురించి ఉంటే అతనికి చేయూతనిచ్చి, చేతనైనంత సహాయ సహకారాన్ని అందించి గట్టెక్కించడాన్నే 'దయ' అంటారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్న ఒక అభాగ్యునికి సౌలభ్యాన్ని చేకూరిస్తే దేవుడు వారికి ఇహపరాల్లోనూ సౌలభ్యాన్ని ప్రసాదిస్తాడు. దారి నుండి ఏదైనా హానికర వస్తువు తీసిపారేయడం కూడా పుణ్యం క్రిందికే వస్తుంది. అలా ఒక దయార్ద్ర హృదయుడే చేయగలడు. దౌర్జన్యపరుడు, కల్మష హృదయుడు ఇలా ఎన్నటికీ చేయలేడు. ''ఇమాతతుల్ అజా అనిత్తరీఖీ సదఖా'' అని తెలిసిన మీరు కఠినుల మార్గాన నడవకండి. కరుణ గలవారి దారినే సాగిపోండి. మీ జీవితాల్లో సుఖ శాంతులు వెల్లివిరుస్తాయి. మీ బ్రతుకుకి సార్థకత చేకూరుతుంది.

''ప్రజలారా! ఇంకో విషయం కూడా మీతో చెప్పాల్సి ఉంది. వితంతువులు, నిరుపేదల బాగు కోసం కృషి చేసేవాడు దైవ మార్గంలో పోరాడే యోధుడితో, అలుపెరగకుండా దైవారాధన చేసే భక్తుడితో, నిరంతరం ఉపవాసాలు పాటించే భక్తి పరాయణుడితో సమానం.'' (బుఖారీ- ముస్లిం)

అలాగే మీ అధీనంలో, సంరక్షణలో ఉన్న అనాథల పట్ల మృదువుగా వ్యవహరించండి. మీ సంతానానికి- వారికి మధ్య విచక్షణను పాటించకండి. పక్షపాత వైఖరికి తావివ్వకండి. నన్ను, నా ఈ మాటను పూర్తిగా నమ్మండి. ఏ వ్యక్తి అయితే నిస్వార్థభావంతో కేవలం దైవ ప్రసన్నతను కోరుతూ, ప్రేమతో ఓ

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**"స్వర్గంలో ప్రవేశించాలన్నా, దైవ దర్శన భాగ్యం లభించాలన్నా నిస్వార్థ సేవతో ముందడుగు వేయాలి. భూమ్యాకాశాలంతటి విశాలమైన స్వర్గం వైపు సాగిపోండి, మీరు మీ అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లే, ఇతరుల అక్కరలకు సైతం ప్రాముఖ్యాన్నివ్వండి.**

అనాథ బాలుడు మరియు బాలిక తలను నిమురుతాడో అతను వారిరువురి శిరోజాలంతటి పుణ్యాన్ని మూటగట్టుకుంటాడు. దైవం దృష్టిలో గృహాలన్నిటికంటే అతి ప్రియమైన గృహం ఏదో చెప్పనా? ఏ గృహంలోనైతే అనాథల ఆత్మాభిమానాన్ని, వారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం జరుగుతుందో అదే శుభ నిలయం.

"మరో విషయం సైతం చెప్పాల్సి ఉంది. వాక్చాతుర్యం, వాక్పటిమ గల వ్యక్తుల పట్ల మంచిగా వ్యవహరించినట్లే, తమ గోడును, తమ అవసరాన్ని వెల్లడించలేని మూగ జీవుల పట్ల సైతం మీరు దయ కలిగి ఉండండి. అవసరార్థంగాని, ప్రయాణం కోసంగాని వాటిని తమతో పాటు తీసుకెళ్ళేటప్పుడు వాటి శక్తికి మించిన బరువును వాటిపై వేయకండి. అల్లాహ్ కూడా ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించి బరువు వేయడని తెలుసుకోండి. వాటిపట్ల న్యాయంగా వ్యవహరించండి. న్యాయం అంటే ఏమని తెల్లబోతున్నారా! అవి మోయగలిగేంత బరువును మాత్రమే వేయాలి. దాంతోపాటు వాటికి కావాల్సిన మేతను వేయండి.

"ప్రజలారా! మీ తల్లిదండ్రుల గురించి దేవుడు చేసిన హితవును మరువకండి. దైవానికి ప్రీతికరమైన వాటిలో తల్లిదండ్రుల నిస్వార్థ సేవ కూడా ఒకటని గ్రహించండి. వారికి విధేయులై ఉండండి. వారిని శాంతపర్చండి. తస్మాత్ జాగ్రత్త! దైవ ప్రసన్నత తండ్రి ప్రసన్నతతో ముడిపడి ఉంది. తండ్రి ఆగ్రహంతో దైవాగ్రహం కట్టలు తెంచుకుంటుంది. తండ్రి స్వర్గానికి ప్రథమ ద్వారం అని మరువకండి. తల్లి పాదాల క్రింద స్వర్గం ఉందన్న విషయాన్ని విస్మరించకండి. వారిరువురి కడుపు చల్లగా ఉంటేనే - రేపు హష్ర్ మైదానంలో మీకు దైవ సింహాసనపు చల్లని నీడ ప్రాప్తమవుతుంది సుమా!

"ప్రజలారా! దేవుని ప్రేమలో లీనమవండి. ఆయన ధర్మోన్నతి కోసం ప్రాణాలొడ్డి పోరాడటం కన్నా మించిన మంచి కార్యం మరొకటి లేదు. ఈ ప్రపంచం ఓ పరీక్షా స్థలం. ఇక్కడ మంచి చెడు చేసే స్వేచ్ఛ మీకుంది. రేపు రానున్న రోజు తీర్పు దినం. అక్కడ లభించే శాశ్వత కీర్తిప్రతిష్టలు దైవ ప్రసన్నత కోసం అహర్నిశలు పరిశ్రమించే వారికి మాత్రమే వర్తిస్తాయి.

"స్వర్గంలో ప్రవేశించాలన్నా, దైవ దర్శన భాగ్యం లభించాలన్నా నిస్వార్థ సేవతో ముందడుగు వేయాలి. భూమ్యాకాశాలంతటి విశాలమైన స్వర్గం వైపు సాగిపోండి, మీరు మీ అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లే, ఇతరుల అక్కరలకు సైతం ప్రాముఖ్యాన్నివ్వండి.

స్వార్థాన్ని, సంకుచిత భావాన్ని విడనాడండి. పరస్పరం సోదరులుగా దైవ దాసులై జీవించండి. గుర్తుంచుకోండి! 'స్వార్థం' అనే ఈ విష వాయువే గతించిన సమాజాలను పొట్టనబెట్టుకుంది. ముస్లిం సముదాయం విషయంలో మొట్ట మొదట ఇహపరాల దృష్ట్యా, ప్రయోజనం రీత్యా లాభదాయకమైనది త్యాగం, కరుణ, జాలి అని తెలుసుకోండి. ఈ సముదాయాన్ని మట్టు పెట్టేవాటిలో మొదటిది కాఠిన్యం, కరకుదనం, స్వార్థం, అసూయా ద్వేషాలు అని మరువకండి.

"నిస్సందేహంగా ధర్మం సులువైనది. ధర్మం విషయంలో సైతం కాఠిన్యం గల వ్యక్తి ఎక్కువ కాలం నిలువజాలడు. కనుక సన్మార్గంపై నడవండి, మధ్యేమార్గాన్ని అనుసరించండి. ఇంకా ఉదయం, సాయంత్రం మరియు రాత్రి పూట కొంత సేపు ఆరాధనకై వెళ్ళండి. ఇలా గనక మీరు చేస్తే అలుపు సొలుపూ లేకుండా నిక్షేపంగా గమ్యానికి చేరుకుంటారు."






# గాజా మారణ హోమానికి ఎంఐటీ మద్దతివ్వడంపై విద్యార్థిని ఆగ్రహం

## పట్టభద్రుల స్నాతకోత్సవంలో భారతీయ- అమెరికన్ విద్యార్థిని భావోద్వేగ ప్రసంగం

**గంభీరంగా, భావోద్వేగంతో నిండి ఉన్న పట్టభద్రుల స్నాతకోత్సవ సభలో, భారతీయ-అమెరికన్ డిగ్రీ విద్యార్థిని, తరగతి అధ్యక్షురాలు మేఘా వేమూరి మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT) తీరుపై విరుచుకుపడ్డారు. గాజాలో జరుగుతున్న మారణహోమంలో ఇజ్రాయెలుకు ఎంఐటీ మద్దతివ్వడంపై విమర్శలు గుప్పించారు. ఇటీవలె జరిగిన పట్టభద్రుల వేడుకలో ఆమె, పాలస్తీనాకు తన సంఘీభావాన్ని ధైర్యంగా ప్రకటించారు. ఆమె ప్రసంగం ప్రశంసలతో పాటు వివాదాలను కూడా రేకెత్తించిందని హిందుస్తాన్ టైమ్స్ పేర్కొంది.**

కంప్యూటర్ సైన్స్, నాడీ అధ్యయన శాస్త్రం, భాషా శాస్త్రాల్లో డిగ్రీ పొందిన మేఘా, MIT ఇజ్రాయెల్ సంస్థలు, ఇజ్రాయెల్ సైనిక ప్రాజెక్టులతో కలిగి ఉన్న అనుబంధాన్ని ప్రశ్నించారు. “ఇప్పుడు మనం పట్టభద్రులుగా మారుతున్నాం. కానీ ఇదే సమయంలో గాజాలో ఒక్క విశ్వవిద్యాలయం కూడా మిగిలి లేదు” అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఇజ్రాయెల్ పాలస్తీనాను ఈ భూమ్మీద నుంచి తుడిచేయాలని చేస్తున్న ప్రయత్నాన్ని మనం చూస్తున్నాం. ఈ విషయంలో ఇజ్రాయెల్‌కు MIT భాగస్వామిగా ఉండటం ఒక చెడ్డ విషయం” అని ఆమె పేర్కొన్నారు. ఆమె మాటలతో సభలో హర్షధ్వానాలు మారుమ్రోగాయి. “MIT పాలస్తీనా స్వేచ్ఛను కోరుకుంటుందనే విషయాన్ని మీరు ప్రపంచానికి తెలియజేశారు” అని వారు ఆమెను ప్రశంసించారు.

ఇజ్రాయెల్ సైన్యంతో MITకి ఉన్న ప్రత్యేక పరిశోధనా సంబంధాలను మేఘా తీవ్రంగా విమర్శించారు. “ఇజ్రాయెల్ సైన్యానికి MITతో ఉన్న సంబంధమే ఏకైక విదేశీ సైనిక సంబంధం” అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో పాలస్తీనాకు నైతిక మద్దతు పలకమని ఆమె తన సహ పట్టభద్రులను కోరారు. “మనలోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, విద్యావేత్తలు, నాయకులు గాజాలో ప్రజల జీవితాలను రక్షించడంలో భాగస్వాములు కావాలి. అక్కడి సహాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలి. మనమంతా ఆయుధాల నిషేధానికి పిలుపునివ్వాలి, MIT ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకునే వరకు మనం గొంతెత్తి ప్రశ్నిస్తూనే ఉండాలి” అని ఆమె అన్నారు.

మేఘా వేమూరి మానవ హక్కుల పక్షాన ధైర్యంగా నిలబడినందుకు పలువురు ఆమెను ప్రశంసించారు. అయితే, కొంతమంది ఆమెను ఆన్‌లైన్‌లో వేధించి, బెదిరింపులకు గురి చేశారు. పలు ఇజ్రాయెల్ అనుకూల వర్గాలు ఆమెను యూదుల వ్యతిరేకి అని విమర్శించాయి. ఆమె దృక్కోణం భవిష్యత్తులో ఆమె వృత్తి జీవితం మీద ప్రభావం చూపొచ్చని హెచ్చరించాయి. అయితే మసాచుసెట్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) మేఘా ప్రసంగంపై, ఆ ప్రసంగంపై వచ్చిన వివాదంపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

మేఘా వేమూరి జార్జియాలోని అల్‌ఫారెట్టా పట్టణానికి చెందినవారు. 2021లో అల్‌ఫారెట్టా హైస్కూల్ నుండి పట్టభద్రులైన తర్వాత MITలో చదువు ప్రారంభించారు. ఆమె విద్యార్థి నాయకత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. క్లాస్ కౌన్సిల్‌లో తన సేవలు అందించారు. జాతీయ మెరిట్ స్కాలర్ అయిన వేమూరి, మెక్‌గవర్న్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పని చేశారు. దక్షిణాఫ్రికాలోని UCT న్యూరోసైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్న్‌షిప్ చేశారు. అలాగే ఆమె MITలో ఉన్న “రెటన్ రివల్యూషన్” అనే విద్యార్థుల సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ఈ సంఘం విప్లవాత్మక చర్చలకు వేదికగా ఉంది.

MITలో చదువుతున్న సమయంలో, AI సంబంధిత పాఠ్యాంశాన్ని అభివృద్ధి చేయడంలో మేఘా తోడ్పడ్డారు. జోర్డాన్ దేశంలోని హైస్కూల్ విద్యార్థుల కోసం న్యూరోసైన్స్ ప్రోగ్రామ్ రూపొందించడంలోనూ ఆమె సహకరించారు. ఆమె ఇచ్చిన స్నాతకోత్సవ ప్రసంగం మళ్లీ క్యాంపస్ ఉద్యమాలు, విద్యా సంస్థల బాధ్యతను గుర్తు చేస్తుంది.

**- అర్షియా**



# నాన్న... ఓ నాన్న!

- పోలంకి విజయభాస్కర్

**వేలు పట్టి నడిపిస్తూ లోకాన్ని చూపుతూ, తాను కరుగుతూ ఇంటికి వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి నాన్న. తప్పటడుగులు సరిదిద్ది, బిడ్డల భవిష్యత్తు కోసం తపన పడే నిస్వార్థపు మనిషి నాన్న.** బయటకు గంభీరంగా కనిపించినా మనసులో బోలెడంత ప్రేమను దాచుకుంటాడు. పిల్లల భవిత కోసం తన వ్యక్తిగత సంతోషాన్ని సైతం త్యజించే త్యాగమూర్తి నాన్న. తల్లి మనకు జన్మనిస్తే తండ్రి ఆ జన్మకు మూల కారణం. మనమంటూ జీవం పోసుకున్నామంటే అది తల్లిదండ్రులిద్దరి చలవే. తల్లి ప్రేమ భావోద్వేగాలతో ముడిపడి ఉంటే తండ్రి ప్రేమ బాధ్యతతో ముడిపడి ఉంటుంది. ఉద్యోగం అంటూ ఉదయాన్నే లేచి వెళ్ళే నాన్న ఇంటి పట్టున ఉండలేడు..కంటి నిండా నిద్ర పోలేడు. ఇంటి బాధ్యతలను ఒంటి స్తంభంలా మోస్తూ పిల్లల భవిష్యత్తుకు నిరంతరం తాపత్రయ పడతాడు. అటువంటి నాన్నకు గుర్తింపు ఉండాలనే తలంపుతో 1910 జూన్ మూడో ఆదివారం తొలిసారిగా 'స్పోకాన్'లో ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 52 దేశాల్లో తండ్రుల గౌరవార్థం ఈ దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నారు.

నాన్నంటే అడగకుండానే దొరికిన జీవితకాల బహుమతి. బతుకంతా నీడనిచ్చే పెద్ద చెట్టు. అమ్మ ఒడి ప్రేమలు పంచే గుడి అయితే నాన్న భుజం ఈ ప్రపంచాన్ని కళ్ళ ముందుకు తెచ్చే శిఖరం. బిడ్డల మనసుల్లో నిరంతరం ధీమా నింపుతూ దీక్షగా ముందడుగేస్తాడు నాన్న. అసలు నాన్నను అర్థం చేసుకునే అవకాశం ఎంత మంది పిల్లలకు వస్తుంది? ఆయన ప్రేమ ఎవరికీ అర్థం కాదు. కుటుంబం కోసం అనుక్షణం ఎంతో కష్టపడినా ఎప్పుడూ తెర వెనుకాలే ఉండే వ్యక్తి నాన్న. తన కష్టాలకు, త్యాగాలకు ఏనాడూ ప్రతిఫలం ఆశించని నిస్వార్థ వ్యక్తిత్వం నాన్నది.

### మార్పులకు అనుగుణంగా...

మారుతున్న కాలానికి అనుగుణంగా నాన్న తన బిడ్డల భవిష్యత్తు కోసం తనను తాను ఎప్పటికప్పుడు మలుచుకుంటున్నాడు. నేటి ఆధునిక సమాజంలో మార్పులకు తగ్గట్టు, కుటుంబానికి తగ్గట్టు ఆ మాటకొస్తే పిల్లలకు నచ్చినట్టు మారిపోయాడు. చిన్న పిల్లలకు గరువుగా, వారికి వయసు పెరిగే కొద్దీ స్నేహితుడిగా, వారికి పెళ్ళయ్యాక మార్గదర్శిగా మారిపోయాడు. ఉద్యోగం, కష్టాలు, అసౌకర్యాలు, అనర్థాలు ఎన్ని ఎదురైనా ఎదురుగా పిల్లలు కనిపిస్తే తాను చిన్న పిల్లాడిలా మారిపోవడం నేర్చుకున్నాడు. పిల్లలు ఒంటరితనంతో బాధపడుతున్నప్పుడు ఓ జవాబుగా మారిపోతు న్నాడు. అందుకే అమ్మకు ధీటుగా నాన్న కూడా పిల్లలకు దగ్గరయ్యాడు. అందుకే ఇప్పటి తరం పిల్లల్లో చాలా మంది నాన్నకు ప్రేమతో దగ్గరైపోతున్నారు.

## కన్నవాళ్ళ కోసం....

గతంలో తల్లికి దగ్గరగా ఉండే పిల్లలు నేడు తండ్రికి దగ్గరవుతున్నారు. తండ్రి ఓ స్నేహితుడిగా, పిల్లల మానసిక పరిస్థితులను బట్టి సలహాలు, సూచనలు ఇస్తూ వారి ఎదుగుదలకు కృషి చేస్తూ ఉంటాడు. జీవితపు రహదారిలో ఎన్ని గతుకులు వున్నా అలుపెరుగక తనని కన్నవాళ్ళ కోసం తను కన్నవాళ్ళ కోసం ప్రతిక్షణం తపించే మహనీయుడు నాన్న. నాన్న చూపిన బాటలో విజయం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. కానీ అపజయం మాత్రం ఉండదు. గెలిచినప్పుడు పది మందికి ఆనందంగా చెప్పుకునే వ్యక్తి ఓడినప్పుడు భుజంపై తట్టి గెలుస్తావులే అని దగ్గరికి తీసుకుని భరోసానిచ్చే వ్యక్తి నాన్న.

## తడబడే వయసులో పిల్లల్ని ఎలా చూసుకోవాలి?

మన కోసం ఎన్నో కష్టనష్టాలు, వ్యయ ప్రయాసలను ఓర్చుకుంటారు. త్యాగాలు, సపర్యలు, సేవలు చేసీ చేసీ వాళ్ళు వయసులో ఉన్నప్పుడు మన కోసం కరిగిపోతారు. వారి శరీరం వంగి పోయినప్పుడు, ముడతలు పడేలా కష్టపడినప్పుడు వారి వృద్ధాప్యంలో మనం వారికి ఏం చేస్తున్నాం? ఆయన మన కోసం చేసిన త్యాగాలకు ప్రతిఫలంగా మనం ఏం ఇస్తున్నాం? ఆ వయసులో వారు కోరుకునేదేమిటి? కాస్తంత ప్రశాంతత, వాళ్ళు ప్రశాంతంగా ఉండేలా చూడాలి. మన పిల్లలతో ఆడుకునే సమయాన్ని ఇవ్వాలి. ఆయన తన అనుభవాలను చెబుతుంటే శ్రద్ధగా విని, వారిని సంతోషపెట్టాలి. వయసు పెరిగిన కొద్దీ నాన్న కూడా ఓ కొడుకే. వాళ్ళ నాన్న నుంచి ఎలాంటి ప్రేమనైతే కోరుకుంటాడో అదే ప్రేమను, వాత్సల్యాన్ని కొడుకుల నుంచి కోరుకోవడంలో తప్పేం లేదు కదా! నీ కడుపున పుట్టిన పిల్లలు నీకు ఎంత మధురమో, నిన్ను కనిపెంచిన తండ్రి అంతే అపురూపం. అందుకే నాన్నను వెనుకబడనీయకండి. నాన్నకు చేయూతనివ్వండి. నాన్నతో కలసి నడవండి. మీ నాన్నకు నాన్న అవ్వండి!

# సమయం

1




వేసవి సెలవులు రాకముందు సెలవులలో ఎన్నో పనులు చేయాలి అని ప్రణాళికలు వేసి ఉంచుకున్నాను. దాదాపుగా సెలవులు అయిపోవటానికి వచ్చాయి. “ఎక్కడ వేసిన గొంగళి అక్కడే’ అన్నట్టు పనులు అలాగే ఉండిపోయాయి. సమయం సరిపోలేదు, ఇంకొంచెం సమయం ఉంటేనా, అన్ని పనులు చేసేవాడిని అనుకున్నాను. దాదాపుగా ప్రతి ఒక్కరికీ ఇది అనుభవంలోకి వచ్చి ఉంటుంది.

ప్రతి ఒక్కరికి 24 గంటల సమయం ఉంటుంది. Time is a paradox. అంటే సమయమనేది ఒక వైరుధ్య భావం. ఒక పక్క మనకు టైమ్ చాలడం లేదనిపిస్తుంది. మరోపక్క చాలినంత సమయం ఉండీ ఒక్కొక్కసారి ఏం చేయాలో అర్థం కాదు. ఇదే కాలమహిమ.

మనం అనేక విషయాలు, పనులు అనాలోచితంగా, అలవాటుగా చేస్తుంటాం. మన అలవాట్లను బాగా పరిశీలించి కాలాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయవచ్చు. మనం నేర్చుకున్న ప్రవర్తనాంశాలు మన అలవాట్లుగా మారతాయి. ఒకే పనిని కొన్నిసార్లు వరుసగా (రోజూ) చేయడం వల్ల అవి అలవాట్లుగా మారతాయి. మన మెదడు అలవాటు పడిన వాటినే కొనసాగిస్తుంది. మన మెదడు కొత్తదాన్ని చేయటానికి, మనం ప్రయత్నించడానికి మొదట ఇష్టపడదు. పాతదాని స్థానంలో కొత్తదాన్ని ప్రయత్నించటం కష్టమే కాని, అసాధ్యమైతే కాదు. చెడు అలవాట్లను మంచి వాటితో మార్పిడి చేయగలగడమే కీలకమైన అంశం. కనుక ముందుగా మన అలవాట్లు ఏమిటో మనం తెలుసుకోవాలి.

రోజూ మనం మన ప్రవర్తనను పరిశీలించడం, ఇతరుల సహాయంతో మన ప్రవర్తన గురించి తెలుసుకుని ఒక నోట్సు తయారు చేసుకోవచ్చు. ప్రవర్తనను నిజాయితీగా పరిశీలించి, మార్చుకోవలసిన అలవాట్లను గుర్తించాలి. తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవడం చేయాలి. అప్పుడు మనం సమయాన్ని మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. తెలివైన నిర్ణయాలు తీసుకోవడం అలవాటుగా మారుతుంది. ఇప్పుడే తొలి అడుగుతో వెయ్యి మైళ్ళ దూరాన్ని ప్రారంభించండి.

రాత్రి పడుకునే ముందు ఆ రోజు చేసిన మంచి, చెడు పనుల బేరీజు వేసుకోమని ఇస్లామీ పండితులు చెబుతారు. నిత్యం మనలో ఖుర్ఆన్‌లోని అల్ అస్ర్ సూరా సారాంశం మెదలుతూ ఉండాలి. తద్వారా పాప క్షమాపణ, తప్పుల మన్నింపు కోసం దుఆ చేసుకుని కొత్త రోజును నూతనోత్సాహంతో ప్రారంభించవచ్చు.




## ఆపరేషన్ సింధూర్‌పై వ్యాసరచన పోటీలు

ఇటీవల పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌పై ఈ నెల 1 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు రక్షణ శాఖ ప్రకటించింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి రూ.10 వేల చొప్పున బహుమతి అందజేయడమే కాక ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తామని ఎక్స్‌లో తెలిపింది. అభ్యర్థులు ఆంగ్లం, హిందీలలో వ్యాసాలను పంపాలని కోరింది.

## వక్ఫ్ పోర్టల్ ఉమీద్ ప్రారంభం

వక్ఫ్ సవరణ చట్టం అమలుపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఉద్దేశించిన ప్రత్యేక పోర్టల్ 'ఉమీద్' (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్)ను ఈ నెల 6న ఆవిష్కరించనుంది. వక్ఫ్ ఆస్తులు అన్నింటినీ ఆరు నెలల్లోగా ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఆస్తుల కొలతలు, వివరాలు, జియో ట్యాగింగ్ లొకేషన్‌ను కూడా జత చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఆస్తులను రిజిస్టర్ చేయకపోతే వాటిని వివాదాస్పద ఆస్తులుగా పరిగణించి ట్రిబ్యునల్ పరిశీలనకు పంపిస్తారు. మహిళల పేరున వక్ఫ్‌ను ఏర్పాటు చేయకూడదని తెలిపింది. మరోవైపు, వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

## హైదరాబాద్ కుర్రాడు.. స్పెల్లింగ్ బీ విజేత

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక 'స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ' చాంపియన్ షిప్‌ను హైదరాబాద్ మూలాలున్న 13 ఏళ్ల భారతీయ అమెరికన్ కుర్రాడు ఫైజాన్ జాకీ గెల్చుకున్నాడు. Eclaircissement అనే పదంలోని అక్షరాలను సరిగా చెప్పటంతో ఫైజాన్ విజేతగా నిలిచాడు. అస్పష్టంగా ఉన్న దానిని పరిష్కరించటం, జ్ఞానోదయం కలిగించటం అని ఈ పదానికి ఉన్న అర్థం. ఫైజాన్ అమెరికాలోని సీఎం రైస్ మిడిల్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి. ఇప్పటి వరకూ నాలుగుసార్లు స్పెల్లింగ్ బీ పోటీల్లో పాల్గొన్న ఫైజాన్.. గత ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. ఈసారి చివరిదైన 21వ రౌండ్‌లో ముగ్గురితో పోటీపడి గెలుపును సొంతం చేసుకున్నాడు. కాగా, 1925లో ప్రారంభమైన స్పెల్లింగ్ బీ పోటీకి ఇది 100వ సంవత్సరం కావటం విశేషం. తరచూ భారతీయ అమెరికన్ విద్యార్థులే స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌ను గెల్చుకుంటున్నారు. విజేతలకు 50వేల డాలర్ల నగదు, మెడల్, ట్రోఫీని అందిస్తున్నారు.

## రాజ్యాంగంతోనే భారత్ సమైక్యం సుదృఢం



ఎటువంటి సంక్షోభం తలెత్తినా భారతదేశం సమైక్యంగా, సుదృఢంగా ఉండేలా రాజ్యాంగం తగిన జాగ్రత్తలను పొందుపరిచిందని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. అలహాబాద్ హైకోర్టు న్యాయవాదుల చాంబర్లతోపాటు బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని జస్టిస్ గవాయ్ ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత భారత్ అభివృద్ధిపథంలో కొనసాగిందంటే అది రాజ్యాంగం వల్లనేనన్నారు. మన పొరుగుదేశాల పరిస్థితి ఎలా ఉందో కనిపిస్తూనే ఉందన్నారు. రాజ్యాంగం అమలైన ఏడున్నర దశాబ్దాల కాలంలో దేశంలో సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని తీసుకురావటానికి శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు ఎంతగానో తోడ్పడ్డాయని తెలిపారు. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య వైరుధ్యం తలెత్తితే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం ఇవ్వాలని 1973 ముందు వరకూ సుప్రీంకోర్టు భావించేదని జస్టిస్ గవాయ్ తెలిపారు. 1973లో 13 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం.. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉంటుందని పేర్కొంటూనే.. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రాజ్యాంగానికి ఆత్మవంటివని ఆ తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. రాజ్యాంగం అనే బంగారు రథానికి ఇవి రెండు చక్రాల వంటివని, ఏ చక్రాన్ని ఆపినా రథం ఆగిపోతుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు.

సర్వత్రా

## గాజా విషాదంపై ఐక్యరాజ్యసమితిలో కన్నీళ్లు పెట్టుకున్న పాలస్తీనా రాయబారి!

"ఇజ్రాయెల్ అమానవీయ దాడులు, ఆకలి మా పిల్లలను కబళిస్తున్నాయ"ని ఐక్యరాజ్యసమితి ప్రసంగంలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ విలపించారు, గాజాలో ఇజ్రాయెల్ సైనిక మారణకాండను ఖండించారు. పిల్లల ప్రాణనష్టం గురించి హృదయ విదారక కథనాలను పంచుకున్నారు. గాజాలో తీవ్రతరం అవుతున్న మానవతా సంక్షోభం గురించి మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు. పాలస్తీనా కుటుంబాల బాధలను వివరిస్తూ, ప్రసంగం మధ్యలో మన్సూర్ తన భావోద్వేగాలను అణచుకోవడానికి చాలా కష్టపడ్డారు. డజన్ల కొద్దీ పిల్లలు ఆకలితో చనిపోతున్నారు. గద్గద స్వరంతో "నాకు మనవళ్లు ఉన్నారు. పాలస్తీనియన్ కుటుంబాలపట్ల ఇజ్రాయెలీల ఉద్దేశం ఏమిటో నాకు తెలుసు. ఇజ్రాయెల్ జరుపుతున్న ఈ దమనకాండపై ప్రపంచం చలించకుండా ఉంటోంది. అయితే పాలస్తీనియన్ల బాధలను చూడటం ఏ సాధారణ మానవుడైనా భరించలేడ"ని ఆయన భావోద్వేగంతో తన ముందు ఉన్న డెస్క్‌ను కొట్టి మరీ తన బాధను ఐక్యరాజ్యసమితి ముందు వ్యక్తపరిచారు. "మంటలు, ఆకలి పాలస్తీనా పిల్లలను మింగేస్తున్నాయి. అందుకే మేము చాలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాము". మార్చి కాల్పుల విరమణ విఫలమైనప్పటి నుండి పెరుగుతున్న ప్రాణనష్టాన్ని మన్సూర్ ఉదహరించారు: "1,300 మందికి పైగా పాలస్తీనా పిల్లలు మరణించారు. దాదాపు 4,000 మంది గాయపడ్డారు. మేము మా పిల్లలను ప్రేమిస్తున్నాము. మేము మా ప్రజలను ప్రేమిస్తున్నాము. వారు ఈ విషాదం, ఈ క్రూరమైన దాడులను ఎదుర్కోవడం మాకు ఇష్టం లేదు. నేను మీకు హామీ ఇస్తున్నాను, పాలస్తీనాలో పాతుకుపోయిన ఆలివ్ చెట్ల కంటే, రోమన్ చెట్ల కంటే ఎక్కువగా మేము పాలస్తీనాలో ఎక్కువగా పాతుకుపోయాము. మేము ఎప్పటికీ దూరంగా ఉండము. మేము ఎండిపోము. మేము మా మాతృభూమిలోనే ఉంటామ"ని ఆయన అన్నారు. "ఏదైనా చేయండి. పాలస్తీనా ప్రజలపై ఈ నేరం కొనసాగకుండా ఆపండి, ఈ మారణ హోమాన్ని ఆపండి" అని భద్రతా మండలిని చర్య తీసుకోవాలని పాలస్తీనా రాయబారి మన్సూర్ డిమాండ్ చేశారు:

## బంగ్లాదేశ్ కరెన్సీనోట్లపై నుంచి షేక్ ముజీబుర్ రహ్మాన్ ఫోటో తొలగింపు!

ముహమ్మద్ యూనిస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి, దేశ వ్యవస్థాపక అధ్యక్షుడు, బంగ్లా జాతిపిత షేక్ ముజీబుర్ రహ్మాన్ చిత్రాన్ని ఆ దేశ కరెన్సీ నోట్లపై నుంచి తొలగించనున్నట్లు వార్తా సంస్థ ఢాకా ట్రిబ్యూన్ తెలిపింది. కాగా, ఆయన కుమార్తె షేక్ హసీనా గత సంవత్సరం ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలిగిన తర్వాత దేశం నుండి అనధికారికంగా నిష్క్రమించిన విషయం తెలిసిందే. అభిజ్ఞ వర్గాల నివేదికల ప్రకారం.. బంగ్లాదేశ్ ఇటీవల కొత్తగా రూపొందించిన నోట్లను జారీ చేయడం ప్రారంభించింది, వీటిలో దేశ స్థాపకుడు 'బంగబంధు' షేక్ ముజీబుర్ రహ్మాన్ చిత్రాలను తీసేసారు. బంగ్లాదేశ్‌లోని అధికారులు కొత్త శ్రేణి కరెన్సీ నోట్లను విడుదల చేసినట్లు తెలిసింది, వీటిలో చారిత్రాత్మకంగా మొదటిసారిగా ముజీబుర్ రహ్మాన్ ఫొటో లేదు. కరెన్సీ నోట్లపై మునుపటి డిజైన్‌ను తొలగించడానికి కొత్త బ్యాంకు నోట్లు జారీ చేసిందని విశ్వసనీయ వర్గాల భోగట్టా.

## పాలస్తీనాకు సంఘీభావంగా తుర్కియే క్రీడాకారుడి నిరసన - గోల్డ్ మెడల్‌ని నైలు నదిలో పడేసాడు

గాజాలో జరుగుతున్న ఇజ్రాయెల్ దాడులపై ప్రపంచవ్యాప్తంగా న్యాయపరులంతా తమస్థాయిలో నిరసన తెలియజేస్తున్నారు, ఈ దౌర్జన్యాన్ని ఖండిస్తున్నారు. వివిధ దేశాల్లో వేర్వేరు విధాలుగా నిరసనలు జరుగుతున్నాయి. వారంతా పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్నారు. విద్యార్థులు నిరసన చేస్తుండగా, న్యాయవాదులు మరియు చట్టానికి సంబంధించిన వారు తమ తమ రీతిలో నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో, తుర్కియేకి చెందిన ఓ క్రీడాకారుడు ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మరియు పాలస్తీనాకు మద్దతుగా తన వైఖరిని తెలియజేయడానికొక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకున్నాడు. అతను గెలిచిన బంగారు పతకాన్ని నైలు నదిలో పడవేశాడు. అతను "ఎక్స్"లో ఓ వీడియోను పోస్టు చేశాడు. అందులో అతను ఇలా అన్నాడు: "నా విజయాల్లో ఏదీ బాధిత పాలస్తీనీయుల రక్తపు బొట్టు విలువకంటే ఎక్కువ కాదు."

# ఆచరణలను బట్టి పరలోకంలో...

## - ముహమ్మద్ వహీదుద్దీన్

**విశ్వాసానికి చెందిన ఐదవ అంశం పరలోకాన్ని దృఢంగా విశ్వసించడం.** పరలోకాన్ని విశ్వసించడమంటే తీర్పు జరిగే ఒకరోజు ఖచ్చితంగా రానున్నదని, అల్లాహ్ ముందు మానవుల కర్మలు పరిశీలించబడతాయని, ఆనాడు ఎవరి కర్మలు సవ్యంగా ఉంటాయో వారు మంచి బహుమానం పొందుతారని, ఎవరి కర్మలు అపసవ్యంగా ఉంటాయో వారు శిక్షకు గురవుతారని, అలాగే అక్కడి శిక్షా బహుమానాలు రెండూ అనంతమయినవని నమ్మడం.

తమ కర్మలనుబట్టి పరలోకంలో మనుషులు మూడు రకాలుగా విభజించబడతారు–

1) విశ్వాసంలో ముందంజ వేసిన వారి గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

ముందంజ వేసిన వారైతే ముమ్మందు ఉండేవారే. వారే సాన్నిధ్యులు, సకల భోగభాగ్యాలతో నిండి ఉన్న స్వర్గవనాలలో ఉంటారు. వారిలో ముందు వారి నుండి చాలా మంది ఉంటారు. వెనుక వారి నుండి తక్కువ మంది ఉంటారు. బంగారు జలతారుతో అల్లిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఎదురెదురుగా కూర్చుండి ఉంటారు. వారి సమావేశాలలో నిత్య బాల్యం కల బాలురు, మధువు ప్రవహించే చెలమ నుండి నింపిన మధు పాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు కూజాలు తీసుకొని పరుగుతో తిరుగుతూ ఉంటారు. దానిని త్రాగటం వల్ల వారి తల తిరగటం కాని, వారికి బుద్ధిమాంద్యం కలగటం గాని జరగదు. వారు వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లను ఉంచుతారు, ఇష్టమైన దానిని తీసుకోవటానికి, పక్షుల మాంసాన్ని ఉంచుతారు. ఏ పక్షి మాంసం ఇష్టమైతే అది తినాలని, వారి కొరకు అందమైన కళ్ళు గల 'హూర్'లు (రమణీమణులు) ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణిముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. ఇదంతా వారు ప్రపంచంలో చేస్తూ వచ్చిన కర్మలకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. అక్కడ వారు పనికి మాలిన విషయాలు గానీ, పాప విషయాలు గానీ వినరు. ఏ మాట అయినా సరే, సరిగానే, సవ్యముగానే ఉంటుంది. (అల్ వాఖిఅహ్ 56: 10–26)

2) కుడిపక్షం వారి గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ఇక కుడిపక్షం వారు, కుడిపక్షం వారి (అదృష్టాన్ని)ని గురించి ఏమనాలి. వారు ముళ్ళులేని రేగు చెట్లు, అరటిపండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతం కాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు, ఎత్తైన ఆసనాలు వీటి మధ్య ఉంటారు. వారి భార్యలను మేము ప్రత్యేకంగా సరికొత్త పంథాలో సృష్టిస్తాము. వారిని కన్యలుగా చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు, వయస్సులో సమంగా ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారి కొరకు. వారిలో ముందు వారు చాలా మంది ఉంటారు, వెనుక వారు కూడా చాలా మంది ఉంటారు. (అల్ వాఖిఅహ్ 56: 27–40)

3) ఎడమ వైపు వారి గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ఎడమపక్షం వారు; ఎడమపక్షం వారి (దౌర్భాగ్యాన్ని) గురించి ఏమని చెప్పాలి. వారు వడగాలి మధ్య, సలసల కాగే నీటిలో, నల్లని పొగల నీడలో ఉంటారు. అది చల్లగానూ ఉండదు, సుఖంగానూ ఉండదు. ఈ గతి పట్టక ముందు వారు సంపన్నులుగా ఉండేవారు, చెప్పినా వినకుండా మూర్ఖంగా మహా పాపాలు చేస్తూ ఉండేవారు. వారు ఇలా అనేవారు, "మేము మరణించి మట్టిగా మారిపోయినప్పుడు, అస్థిపంజరంగా అయిపోయినప్పుడు, మళ్ళీ లేపబడతామా? పూర్వం గతించిన మా తాతముత్తాతలు కూడా లేపబడతారా?" ప్రవక్తా! వారితో ఇలా అను; "నిశ్చయంగా గతించినవారు, తరువాత వారు, అందరూ ఒక రోజున తప్పకుండా సమావేశపరచబడతారు. దాని కాలం కూడా నిర్ణయమైపోయింది". మార్గభ్రష్టులారా! తిరస్కారులారా! మీరు జఖ్ఖూమ్ చెట్టును ఆహారంగా తింటారు. దానితోనే మీరు మీ కడుపులను నింపుకుంటారు. ఆపై సలసల కాగే నీటిని దప్పికగొన్న ఒంటెల మాదిరిగా త్రాగుతారు. తీర్పుదినం నాడు (ఈ ఎడమపక్షం వారికి లభించే) ఆతిథ్యపు పదార్థాలు ఇవి. (అల్ వాఖిఅహ్ 56: 41–56)

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "ప్రళయదినం రోజున మనుషులు మూడు వర్గాలుగా లేచి నిలబడతారు. ఒక వర్గం స్వర్గవాసులది. మరొక వర్గం నరకవాసులది. ఇంకొక వర్గం వారి పనులను తూకంతో (మీజాన్) తేల్చటం జరుగుతుంది." (ముస్నద్ అహ్మద్, తిర్మిజీ)

సాబికూన్ (స్వర్గంలో ఉత్తమ వర్గం) అస్‌హాబుల్ యమీన్ (కుడివైపు వారు స్వర్గానికి అర్హులు) ప్రతి ఒక్కరూ ఏ మార్గంలో ఉండాలనుకుంటున్నారో ఆ మార్గ జీవితం ఖచ్చితంగా గడపాలి.

ఇందుకోసం పాపాలకు చాలా దూరంగా ఉండాలి. దివ్య ఖుర్ఆన్‌ను ప్రతిరోజు చదివి, దానిని అర్థం చేసుకోవాలి. అమలు పరచాలి. ఇతరులకు చేరవేయాలి. అల్లాహ్‌పై పూర్తిగా విశ్వాసం ఉంచాలి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చెప్పిన విధంగా మన నడవడిక ఉండాలి.

అల్లాహ్ మనందరినీ అద్భుతమైన జన్నతుల్ ఫిర్దౌస్‌కు అర్హులుగా తీర్చిదిద్దుగాక! (ఆమీన్)

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**